

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
3
శుక్రవారం 5 సెప్టెంబరు 2025

ఆచార్య దేవోభవ

- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా 56 మంది ఎంపిక
- మంత్రి మండిపల్లి, కలెక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా ప్రదానం
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం





రాయచోటి(నేతాజీ సర్కిల్), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తల్లి, దండ్రి తర్వాత గురువే ప్రధానం. తెల్లటి పేపర్ లాంటి మనస్తత్వం కలిగిన పిల్లలను తీర్చిదిద్దడంలో గురువు ప్రాధాన్యం మొదటిది. భారత రాష్ట్రపతిగా పనిచేసిన సర్వేపల్లె రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడుగా ఎందరో జీవితాలను తీర్చిదిద్ది వారి హృదయాలలో చెరగని స్థానం సంపాదించుకున్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా ఆయన జయంతి అయిన సెప్టెంబరు 5న ఏటా ఉపాధ్యాయుల దినోత్సవంగా ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తుండడంతో ప్రభుత్వ విద్యాలయాలు ప్రగతిపథంలో పయనిస్తున్నాయి. మౌలిక సౌకర్యాల పెంపుదల చేయడం, ఆంగ్లవిద్య, కంప్యూటర్ విద్య అందుబాటులోకి తీసుకు రావడంతో ప్రభుత్వ పాఠశాలలపై గ్రామస్తుల్లో నమ్మకం పెరిగింది. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు తమ నైపుణ్యాలను మెరుగుపరచుకుంటూ కొత్త కొత్త బోధనోపకరణాలను ఉపయోగిస్తూ విద్యార్థులకు ఆసక్తి కలిగేలా బోధిస్తున్నారు. జిల్లాలో 56 మందిని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు డీఈవో కె.సుబ్రహ్మణ్యం తెలిపారు. రాయచోటిలోని అజయ్ రెసిడెన్సీ కల్యాణ మండలంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్ చేతుల మీదుగా శుక్రవారం అవార్డులను అందుకోనున్నట్లు తెలిపారు.

జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులు

కె.భారతి (హెడ్మాస్టర్, ఎస్‌జేఎస్ఎం జెడ్పీహెచ్ఎస్, బోయినపల్లి, రాజంపేట), వి.రమేశ్ (ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ స్కూల్ లక్కిరెడ్డిపల్లె), పి.ప్రకాశ్ (హెడ్మాస్టర్, జడ్పీహెచ్ఎస్, వాల్మీకిపురం), నాగలక్ష్మి (హెడ్మాస్టర్, జడ్పీహెచ్ఎస్, అంగళ్లు) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో పి.రాజశేఖర్ (జడ్పీహెచ్ఎస్, చిట్వేలి), రేవతి (జడ్పీహెచ్ఎస్, రాచపల్లి, కోడూరు) పి.జనార్దన్ (ఎస్‌జేఎస్ఎం జడ్పీహెచ్ఎస్, బోయినపల్లి రాజంపేట), కె.సౌభాగ్యమ్మ (జడ్పీహెచ్ఎస్, నూలివీడు, గాలివీడు), ఎం.నరసారెడ్డి (ఎంపీపీ స్కూల్, ఎస్.రాజంపేట), శశికళ (ఏపీ మోడల్ స్కూల్ సంబేపల్లె), ఎస్ ఎండీ షఫీవుల్లా (జడ్పీహెచ్ఎస్, పాటూరు, నందలూరు), జి.శ్రీకాంత్‌రెడ్డి (జడ్పీహెచ్ఎస్ చిట్వేలి) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అలాగే ఎ.శివనారాయణగౌడ్ (జడ్పీహెచ్ఎస్, చిట్వేలి), కె.సుదర్శనం (జడ్పీహెచ్ఎస్, చక్రంపేట, పెనగలూరు) ఎ.ప్రసాద్ (జడ్పీహెచ్ఎస్, మట్లి పెద్దూరు), ఎం.రాజశేఖర్‌రెడ్డి (ఏపీ మోడల్ స్కూల్ లక్కిరెడ్డిపల్లె), బి.వెంకట్రమణ (జడ్పీహెచ్ఎస్, మేళ్లచెరువు, పీలేరు), ఎ.సుజాత (జడ్పీహెచ్ఎస్ సీటీఎం, మదనపల్లి), ఎస్.బాలాజీ (జడ్పీహెచ్ఎస్, మట్లవారిపల్లె, రామసముద్రం), ఎస్.మహమ్మద్‌బాషా (జడ్పీహెచ్ఎస్, ఉర్దూ నందిరెడ్డిగారిపల్లె, కురబలకోట), షేక్ చాంద్‌బాషా (జడ్పీహెచ్ఎస్, ఊటుకూరు రాజంపేట), కె.సువర్ణమ్మ (జడ్పీహెచ్ఎస్, నీలకంఠ్రావుపేట, రామాపురం) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

సెకండరీ గ్రేడ్ టీచర్స్ విభాగంలో

చల్లా శ్రీనివాసులు (తాడివాండ్లపల్లె, కోడూరు), కేవీ సుబ్బరాయుడు (ఎంపీపీఎస్, ఈడిగపల్లె, లక్కిరెడ్డిపల్లె), కె.జయమ్మ (ఎంపీ మోడల్ ప్రైమరీ, సంబేపల్లె), ఆర్. మదలస (డీబీఎస్‌పల్లి, రాజంపేట), మోహన్‌రావు (కోళ్లవారిపల్లె, రాజంపేట), వాసుదేవరెడ్డి (మాధవరం, రాయచోటి), కె.చంద్రశేఖర్ (జడ్పీహెచ్ఎస్, నూలివీడు, గాలివీడు). ఎస్.సుహాసిని (మోడల్ ప్రైమరీ లక్కిరెడ్డిపల్లె), జి.శంకరయ్య (గుంతరాచపల్లి, సుండుపల్లె), ఎ.శంకర్‌రెడ్డి (వైకుంఠరాచపల్లి, రాయచోటి), వెంకటేశ్వర్‌రెడ్డి (చెర్లోపల్లి రాజంపేట) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. డి.కవిత (మోడల్ ప్రైమరీ, బోయినపల్లి), ఆర్.గీతాంజలి (బడ్డిపల్లి, కురబలకోట), ఎం.చంద్రశేఖర్ (కొత్తిండ్లు, రాజంపేట), ఎం.సరిత (బొమ్మలవారిపల్లె, కలికిరి), వి.అక్బర్ (తరిగొండ, గుర్రంకొండ), ఎస్.రజిని (బత్తిరెడ్డిగారిపల్లె, పెనగలూరు), బి.సుగుణ (మూరేవాండ్లపల్లి, కలికిరి), అత్తర్ మహమ్మద్ అమీనుల్లా (ఎంపీపీఎస్ ఉర్దూ, వీరబల్లి) ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. అలాగే గురుమూర్తి (బండ్లపల్లి, నిమ్మనపల్లి), షేక్ నూర్‌అహ్మద్ (ఉర్దూ మాసాపేట, రాయచోటి) బి.జ్యోతి (కమతంపల్లి, రామసముద్రం), ఎస్.నాగసుబ్బమ్మ (వెంకటాపురం, రామాపురం), ఎస్.ఎజాజ్ అహ్మద్ (మహల్, కలికిరి), ఎం.ఆంజనేయులు (గుడ్డంపల్లి, పీటీఎం), వి.వెంకట్రమణ (సోంపాలెం, ములకలచెరువు), కె.సుబ్బారెడ్డి (మేడికుర్తి, కలికిరి), జేసీ వెంకటసుబ్బయ్య (పొత్తుకూరుపల్లి, రామాపురం), బుక్కే గోపాల్‌నాయక్ (జ్యోతి కాలనీ కోడూరు), వై.నాగరాజు (ఎస్ఏ పీడీ, జడ్పీహెచ్ఎస్ సీటీఎం), ఎస్.నిర్మల (స్కౌట్స్ అండ్ గైడ్స్ బీఎస్టీ అన్నమయ్య జిల్లా)లు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

యూరియా పంపిణీలో అవకతవకలకు తావివ్వొద్దు

- సబ్ కలెక్టర్ భావన



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ భావన

నందలూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యూరియా పంపిణీలో అవకతవకలకు తావివ్వద్దని రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్ఎస్ భావన తెలిపారు. నందలూరు రైతుసేవా కేంద్రంలో యూరియా పంపిణీని గురువారం ఆమె తనిఖీ చేశారు. వివిధ రైతు సేవా కేంద్రాల్లో యూరియా పంపిణీ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి రైతు దగ్గర ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకాన్ని పరిశీలించి అనంతరం ప్రతి రైతుకు ఒక బ్యాగు చొప్పున యూరియాను పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి మల్లికార్జున వివరించారు. అంతకు ముందు నాగిరెడ్డిపల్లె పంచాయతీ అరవపల్లెలో ఉన్న చౌకదుకాణాన్ని సబ్‌కలెక్టర్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రేషన్ పంపిణీ వివరాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దారు అమరేశ్వరి, ఎంపీడీవో అమర్‌నాథ్, ఆర్ఎస్‌కే సిబ్బంది శిల్ప తదితరులు పాల్గొన్నారు.

పుట్టిన రోజు జరుపుకోకనే...

- సంపులో పడి చిన్నారి మృతి



సంపులో పడి మృతి చెందిన చిన్నారి షానియా

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆ చిన్నారిది శుక్రవారం రెండో పుట్టినరోజు. పుట్టినరోజు ఆనందంగా జరుపుకోవడానికి ఇంట్లో అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే సంపు రూపంలో చిన్నారిని మృత్యువు కబళించింది. ఆ ఇంట్లో ఆనందం కాస్తా విషాదంగా మారిపోయింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె మండలం నీరుగట్టువారిపల్లె సమీపంలోని బాబుకాలనీలో గురువారం సాయంత్రం రెండేళ్ల చిన్నారి షానియా సంపులో పడి మృతి చెందింది. గ్రామ పంచాయతీ వారు ఇళ్లకు నీళ్లు వదిలారు. అందరూ నీళ్లు పట్టుకునే పనిలో ఉండగా చిన్నారి ఆడుకుంటూ పక్క ఇంటికి వెళ్లింది. నీటి కోసం తెరిచి ఉన్న నీటిసంపులో ప్రమాదవశాత్తు పడిపోయింది. ఇంతలోనే తల్లి వెతుక్కుంటూ వెళ్లి చూడగా అప్పటికే సంపులో శవమై కనిపించింది. పుట్టినరోజు చేసుకోకుండానే వెళ్లిపోతివా తల్లీ.. అంటూ తల్లిదండ్రుల రోదన చూసిన వారు కన్నీరు పెట్టారు. చిన్నారి మృతితో బాబుకాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జిల్లాలో 1161.95 టన్నుల యూరియా

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1161.95 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్, రైతు సేవా కేంద్రాల్లో, ప్రైవేటు ఫెర్టిలైజర్స్ షాపుల్లో యూరియా అందుబాటులో ఉందన్నారు. మార్క్‌ఫెడ్‌లో 49.95 టన్నులు, రైతు సేవా కేంద్రాల్లో 608, ప్రైవేట్ ఫెర్టిలైజర్స్ షాపుల్లో 504 టన్నులు అందుబాటులో ఉందని తెలిపారు.

మత సామరస్యం

- లడ్డూ వేలంలో ముస్లింలు
- రూ.1.15 లక్షలు పలికిన వినాయకుడి లడ్డు



లడ్డూను వేలంలో దక్కించుకున్న పఠాన్ యాసిన్‌ఖాన్

సుండుపల్లె, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లెలో మతసామరస్యానికి ప్రతీకగా వినాయకుడి వద్ద నిర్వహించిన లడ్డూ వేలంలో ఓ ముస్లిం వేలం పాట పాడి లడ్డూను దక్కించుకున్నారు. మండల కేంద్రంలోని కార్తికేయనగర్‌లో గురువారం తెల్లవారుజామున నిర్వహించిన 10 కేజీల లడ్డూను వేలం పాటలో రవీస్ కేఫ్ యజమాని పఠాన్ యాసీన్‌ఖాన్ లక్షా 15,500లకు దక్కించుకున్నారు. కలశం చెంబును సయ్యద్‌బాషా రూ.23,500, రూపాయి బిళ్లను రూ.6 వేలకు జనసేన నాయకుడు మున్నా దక్కించుకున్నారు. పోటాపోటీగా వేలంలో లడ్డుతో పాటు కలశం చెంబు, రూపాయి బిళ్లను మైనార్టీలు దక్కించుకుని వినాయకుడిపై తమ భక్తిని చాటుకున్నారు. మండలంలో మొట్టమొదటిసారిగా ఇంత పోటాపోటీగా లడ్డు వేలం జరిగి వాటిని దక్కించుకునేందుకు మైనార్టీలు ముందుకు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఒంటేరు రాజా, మద్దికారి జయరాం, జనార్దన్, అచ్చుల రామ, టీడీపీ నాయకుడు చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎఫ్ఏయూ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో ఆర్కిటెక్చర్ విభాగానికి సంబంధించిన 2, 4 సెమిస్టర్లు, సప్లిమెంటరీ, ప్రత్యేకంగా నిర్వహించిన పదవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వర్సిటీ వైస్ చాన్సెలర్ ప్రొఫెసర్ జి.విశ్వనాథకుమార్ గురువారం విడుదల చేశారు. వర్సిటీ అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి.ఫణీంద్రరెడ్డి మాట్లాడుతూ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో 60శాతం మంది బాలురు, 40శాతం మంది బాలికలు ఉన్నారన్నారు. ఉత్తీర్ణత ఉత్తీర్ణత సాధించని వారికి సప్లిమెంటరీ అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణాధికారి ఉదయప్రకాశ్‌రెడ్డి, నారపరెడ్డి, వర్సిటీ ప్రజాసంబంధాల అధికారి వి.శివకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి

- అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్‌బాబు
- ఉత్సాహంగా 5కే రెడ్‌రన్



ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయచోటి (కలెక్టరేట్), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్‌పై యువతీ, యువకులకు అవగాహన తప్పనిసరిగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేశ్‌బాబు అన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫెస్ట్ 2025-26లో భాగంగా గురువారం 5కే రెడ్‌రన్ మారథాన్‌కి ముఖ్య అతిథిగా జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భాస్కర్, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఆఫీసర్ గౌస్‌బాషా, యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవీన్‌లు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ 5కే రెడ్ రన్ మారథాన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రారంభమై చిత్తూరు రింగు రోడ్డు సర్కిల్ మీదుగా నారాయణరెడ్డిపల్లె నుంచి తిరిగి గవర్నమెంట్ డిగ్రీ కళాశాలకు చేరుకుంది. ఈ మారథాన్‌లో వివిధ కళాశాలలకు చెందిన 150 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ యువతీ, యువకులు ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. క్లస్టర్ ప్రోగ్రాం ఆఫీసర్ భాస్కర్ మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యక్తుల పట్ల వివక్ష చూపకూడదని వారి పట్ల ప్రేమ, అభిమానాలు కలిగి ఉండాలని తెలిపారు. డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ ఆఫీసర్ గౌస్‌బాషా, గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మునియనాయక్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మునినాయక్, జిల్లా క్రీడాశాఖాధికారి విశ్వప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఖాజా, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారులు సాదిక్, పీసీఎస్ఎస్ఎన్‌జీవో ప్రాజెక్టు డైరెక్టర్ జి.చెన్నారెడ్డి, వారి సిబ్బంది, ఐసీటీసీ స్టాఫ్ నర్స్ మధుబాబు, వైద్య ఆరోగ్యశాఖ, వివిధ కళాశాలల అధ్యాపకులు, జిల్లా స్పోర్ట్స్ విభాగానికి చెందిన శిక్షణా అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాస కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న ఆస్థాన పండితులు

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠం ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో గురువారం పోతులూరి వీరబ్రహ్మంగారి సమేత గోవిందమాంబ మాస కల్యాణ మహోత్సవాన్ని ఆస్థాన పండితులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా శుద్ధ ద్వాదశి రోజున మాస కల్యాణమహోత్సవాన్ని నిర్వహిస్తామని బ్రహ్మంగారిమఠం దేవస్థాన మేనేజరు ఈశ్వరాయాచారి తెలిపారు. గురువారం జరిగిన మాస కల్యాణ మహోత్సవంలో దాత నల్లపాటి వెంకట శరత్‌చంద్ర వారి కుటుంబ సభ్యులతో పాటు, తాత్కాలిక మాస కల్యాణ ఉభయదాతలు సరళ నరసింహారెడ్డి, హారిక చంద్రప్రకాశ్‌రెడ్డి, భార్గవి సూర్యప్రకాశ్‌రెడ్డి, సంధ్య ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవంలో పూర్వపు మఠాధిపతులు జ్యేష్టపుత్రుడు వెంకటాద్రిస్వామి పాల్గొన్నారు.

మహాపూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు



మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



పవిత్ర మాలలతో శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి

నందలూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సౌమ్యనాథ స్వామి ఆలయంలో గురువారం మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం పవిత్ర విసర్జన, కుంభప్రోక్షణ, మహానివేదన, బలిహార తీర్థ ప్రసాద గోష్ఠి, సంభావన, పవిత్ర వితరణ తదితర వైదిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్, ఆలయ అర్చకులు సాయిక్రిష్ణ, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్వేషణాత్మక ఆలోచనలతో
పరిశోధనలు 4
ఇన్‌స్పైర్ మనాక్‌తో కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం

రాష్ట్ర అవార్డుకు ముగ్గురు లెక్చరర్లు ఎంపిక



డాక్టర్ ఎలిశెట్టి ధనుంజయ | గూబల రఘురామయ్య | డాక్టర్ సాయినాథరెడ్డి

వీరబల్లి/ఓబులవారిపల్లె, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ముగ్గురు జూనియర్ కళాశాలల లెక్చరర్లు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఇందులో ఒకరు జిల్లాలో పనిచేస్తుండగా మరో ఇద్దరు వేరే జిల్లాల్లో లెక్చరర్లుగా పనిచేస్తున్నారు. వీరబల్లి మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్, తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్న గూబల రఘురామయ్య రాష్ట్ర ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. 2004లో ప్రభుత్వ ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా ఎదుగుతూ 2021లో వీరబల్లి కళాశాలకు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. 2022లో జిల్లా ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఆకేపాడు ఫౌండేషన్ తరపున, 2024లో ఉత్తమ ప్రిన్సిపాల్‌గా కలెక్టర్ చేతుల మీదుగా, 2024లో యోగివేమన యూనివర్సిటీ తరపున ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌గా అవార్డు అందుకున్నారు. దాతల సహకారంతో రూ.10 లక్షలు ఖర్చు చేసి క్రికెట్ మైదానం, స్టేజీ నిర్మాణం, కళాశాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, మంచినీటి సౌకర్యం, మరుగుదొడ్ల మరమ్మతులు, చెట్ల పెంపకంతో పాటు కళాశాల విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచేందుకు విశేష కృషి చేశారు. అవార్డుకు ఎంపికైన రఘురామయ్యను కళాశాల విద్యార్థులు, పలువురు సిబ్బంది అభినందించారు.

ఓబులవారిపల్లె నుంచి ఇద్దరు...

ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లె పంచాయతీలోని బలిజపల్లెకు చెందిన డాక్టర్ ఎలిశెట్టి ధనంజయ కడప జిల్లాలోని వేంపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గణితశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఈయన రాష్ట్ర స్థాయిలో జూనియర్ లెక్చరర్ల విభాగంలో ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. అలాగే ఓబులవారిపల్లె మండలంలోని కొర్లకుంట గ్రామానికి చెందిన డాక్టర్ సాయినాథరెడ్డి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. ఈయన నంద్యాలలోని ఈఎస్‌సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 5వ తేదీ విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా వీరు ఉత్తమ అధ్యాపకులుగా అవార్డు అందుకోనున్నారు.

7న ఫారెస్ట్ ఉద్యోగాలకు పరీక్షలు

- కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్



కడప కలెక్టరేట్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఫారెస్ట్ బీట్ ఆఫీసర్స్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ ఉద్యోగాల కోసం 7వ తేదీ ఆదివారం జిల్లాలో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఏపీ ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీసుకు సంబంధించి ఈ నెల 7వతేదీన ఆఫ్‌లైన్ స్క్రీనింగ్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి 12-30 గంటల వరకు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసరు ఉద్యోగాలకు మధ్యాహ్నం 3 గంటల నుంచి 5-30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. పరీక్ష కంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని అధికారులు, పోలీసు యంత్రాంగం సమన్వయంతో పనిచేసి పరీక్షలను సజావుగా నిర్వహించాలని పేర్కొన్నారు. కాగా.. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సహాయార్థం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని విద్యార్థులకు ఏదైనా సమాచారం కావాలంటే 08562 246344 నెంబరుకు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ నెల 5, 6 తేదీలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, 7 వతేదీ ఉదయం 11 వరకు సిబ్బంది కంట్రోల్ రూమ్‌లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

కన్నతండ్రే కాలయముడు


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్నబంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు.

ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

- జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతో పాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసు లు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్‌కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పదిమంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.


ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

లోకం తీరు



కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుదిశ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


జి.శంకర (ఫైల్)

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో గాయపడి చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడు జి.శంకర (46) మృతి చెందాడు. బుధవారం రాత్రి మదనపల్లె మండలం బసినికొండ గ్రామం, బైపాస్ నాలుగు రోడ్ల కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు గురువారం మృతి చెందారు. తాలుకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె టమోటా మార్కెట్ మాజీ చైర్మన్ భర్త తట్టి శ్రీనివాసులురెడ్డి కారును డ్రైవర్ షేక్ బావాజాన్ వేగంగా వచ్చి నాలుగు రోడ్ల కూడలిలో నిలిచి ఉన్న ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నిమ్మనపల్లె మండలం ఎగువ మాచిరెడ్డిగారిపల్లెకు చెందిన జి.శంకర మృతి చెందాడు. గాయపడిన మరో వ్యక్తి బొమ్మనచెరువు గోపాల్ చికిత్స పొందుతున్నాడు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె మండలం కొత్తిండ్లులో బుధవారం రాత్రి జరిగింది. తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు కొత్తపల్లె పంచాయతీ రంగారెడ్డి కాలనీ కొత్తిండ్లు చర్చి వీధికి చెందిన షేక్ అర్షద్‌బాషా కుమారుడు షేక్ మహమ్మద్ జైన్ (23) ఇంటిపైన గదిలో ఫ్యాన్‌కు బెల్టుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇతను కామెర్ల వ్యాధితో ఏడాదిగా బాధపడుతూ ఆస్పత్రుల్లో, నాటు వైద్యం చేయించారని, అయినా వ్యాధి నయం కాకపోవడంతో ఇంటివద్దే ఉంటున్నాడు. రాత్రి 9 గంటలైనా భోజనానికి రాకపోవడంతో తండ్రి గదిలోకి వెళ్లి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తండ్రి షేక్ అర్షద్‌బాషా ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని మహిళ దుర్మరణం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో దేవిక (56) దుర్మరణం చెందినట్లు పోలీసులు తెలిపారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు మండలంలోని తట్టివారిపల్లెకు చెందిన దేవిక తట్టివారిపల్లె బైపాస్ సర్కిల్ సమీపంలోని ఓ వైసీపీ నేత ఇంట్లో పనిమనిషిగా పనిచేస్తోంది. అక్కడికి వెళ్లేందుకు నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని గాయపడింది. స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించే క్రమంలో ఆస్పత్రిలోనే మృతి చెందింది. తాలుకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యూరియా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

- డిప్యూటీ విజిలెన్స్ అధికారి గీతావాణి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ విజిలెన్స్ అధికారి గీతావాణి పేర్కొన్నారు. గురువారం ఒంటిమిట్టలోని ఎరువుల దుకాణాలను మండల అధికారి మంజులరాణి సీఐ బాబుతో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియా విక్రయించాలని, మండలంలోని ఎరువు దుకాణాల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదన్నారు. ఎక్కడైనా అధిక ధరలకు యూరియా అమ్ముతున్నట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారలు, రైతులు పాల్గొన్నారు.

అన్వేషణాత్మక ఆలోచనలతో పరిశోధనలు

- ఇన్‌స్పైర్ మనాక్‌తో కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం
- దరఖాస్తులకు ఈనెల 15 వరకు గడువు


అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ (ఫైల్)

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అన్వేషణాత్మక ఆలోచనలను ప్రోత్సహించి పరిశోధనల వైపు ఆసక్తిని పెంపొందింపజేయడానికి కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ మనాక్ నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా 6 నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యార్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిని పరిశీలించి ఒక లక్ష అత్యుత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి ఒక్కొక్క విద్యార్థికి రూ.10 వేలు చొప్పున వారి అకౌంట్‌కు నేరుగా నగదును బదిలీ చేస్తున్నట్లు తెలియజేశారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వీరికి ప్రాజెక్టు పోటీలు నిర్వహిస్తారు. చివరికి 60 మంది విద్యార్థుల ప్రాజెక్టులను ఎంపిక చేసి వాటిని అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుంది. 2025-26 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనాక్ అవార్డు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జూన్ 15 నుంచి ప్రారంభించగా ఇప్పటివరకు 850 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 15వ తేదీతో గడువు ముగుస్తుంది. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలతో పాటు ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఒక్కొక్క పాఠశాల నుంచి ఐదు మంది ఏడు నామినేషన్లు సమర్పించాల్సి ఉందన్నారు.

జిల్లా అగ్రస్థానమే లక్ష్యం

అన్నమయ్య జిల్లాను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యమని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. గత సంవత్సరం అన్నమయ్య జిల్లా రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచిందని, ఈ సంవత్సరం అగ్రస్థానమే లక్ష్యంగా 3 వేల ప్రాజెక్టులు సమర్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. సృజనాత్మకత, ఆవిష్కరణల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి సరైన నివేదికను అందించినట్లు తెలిపారు.

అన్ని పాఠశాలలు నామినేషన్లు సమర్పించాలి

జిల్లాలో ప్రైవేటు పాఠశాలలతో సహా అన్ని ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నామినేషన్లు సమర్పించారు. ఈ పథకం యువ విద్యార్థులకు సైన్స్ అధ్యయనం చేయడానికి పరిశోధన, వృత్తి పట్ల ఆసక్తిని పెంచడానికి భారతదేశంలో విస్తృత ఆవిష్కరణ సంస్కృతిని పెంపొందించడానికి ప్రయత్నిస్తుంది. కాబట్టి అన్ని పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించి నామినేషన్లు సమర్పించడానికి ఉపాధ్యాయులు, ఎంఈవోలు బాధ్యత వహించాలి.

- డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, జిల్లా విద్యాశాఖ అధికారి

ఇన్‌స్పైర్ పథకం చక్కగా ఉపయోగించుకోవాలి

చిన్న వయస్సులోనే విద్యార్థులను సైన్స్‌ను అనుకరించడానికి పరిశోధన ఆధారిత కెరీర్ వైపు ప్రేరేపించడానికి ఇన్‌స్పైర్ మనాక్ అవార్డును ప్రతి ఒక్కరూ చక్కగా ఉపయోగించుకోవాలి. ఇందుకోసం గైడ్ టీచర్లకు శిక్షణ ఇచ్చాం. ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేస్తున్నాం. అగ్రస్థానమే లక్ష్యంగా సైన్స్ ఉపాధ్యాయులు అందరూ పనిచేస్తున్నారు. అందరి సహకారంతో లక్ష్యాన్ని సాధిస్తాం.

- మార్ల ఓబుల్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి జిల్లా కోసం పోరాడు...

- రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ జగన్‌మోహన్‌రాజు


విలేకరులతో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై ఆరోపణలు చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ముందు ఎమ్మెల్యే పదవికి, వైసీపీకి రాజీనామా చేసి రాజంపేట ప్రజలతో కలిసి జిల్లా కేంద్రం కోసం పోరాడాలని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. గురువారం రాజంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీకి వెళ్లని వైసీపీ ఎమ్మెల్యేలకు ప్రజల బాధలు తెలియవన్నారు. వైసీపీ హయాంలో రాజంపేటకు అన్యాయం చేసిన ఆకేపాటి తన ఆస్తులు మాత్రం బాగా పెంచుకున్నారని విమర్శించారు. రాజంపేటను జిల్లా కేంద్రం కాకుండా చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని ఆకేపాడుకు పిలిపించుకుని సంబరాలు చేసుకున్నది ఎవరో అందరికీ తెలిసిందేనన్నారు. చంద్రబాబును ప్రశ్నించే అర్హత ఆకేపాటికి లేదని, దమ్ముంటే అసెంబ్లీ సమావేశాలకు వెళ్లి రాజంపేట జిల్లా కేంద్రం కోసం పోరాడాలన్నారు. రాజంపేటకు అన్యాయం చేసినప్పుడు జగన్‌మోహన్‌రెడ్డిని ఆకేపాటి ఎందుకు ప్రశ్నించలేదన్నారు. రాజంపేట నియోజకవర్గంలోని ప్రాజెక్టులను, ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కేంద్రాలకు, మెడికల్ కళాశాల మదనపల్లెకు తరలించుకుపోతుంటే ఆయన ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. వెంకటేశ్వరస్వామి ఆస్తులను కాజేసేందుకు ఉన్న శ్రద్ధ ప్రజలపై ఉంటే రాజంపేటకు జిల్లా కేంద్రం వచ్చేదని ఆరోపించారు. రాజంపేట అభివృద్ధి, జిల్లా కేంద్రం లక్ష్యంగా టీడీపీ పనిచేస్తుందన్నారు. రాజంపేట అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువస్తామన్నారు. సమావేశంలో రాజంపేట పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు, నాగేశ్వర్‌నాయుడు, ఎస్‌కే కరీం, గీతాంజలి రమణ, గంపా శివ, మందా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


రైతు ఉత్పత్తిదారుల దుకాణాల సందర్శన

నిమ్మనపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు ఉత్పత్తి దారుల సంఘం ద్వారా రైతుల కోసం ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణాలు బాగున్నాయని శ్రీసత్యసాయి జిల్లా డీఆర్‌డీఏ డైరెక్టర్ నరసయ్య తెలిపారు. గురువారం సత్యసాయి జిల్లా నుంచి శాప్ సీఎంఎస్ వృత్తి సంస్థ అధ్వర్యంలో బృందం సభ్యులతో కలిసి రైతు ఉత్పత్తి ఎరువుల దుకాణాలను క్షేత్రస్థాయి సందర్శనకు విచ్చేశారు. అయన రైతుల పంటలకు సంబంధించి ఏ విధంగా ఎరువులు, క్రిమి సంహారక మందులు ఇతర వస్తువులు పంపిణీ చేస్తున్నారని ఆరా తీశారు. రైతుల ఇంటి వద్దకే ఎరువులు క్రిమి సంహారక మందులు పంపిణీ చేయడం హర్షంచదగ్గ విషయమన్నారు. యూరియాతో పాటు మిగిలిన డీఏపీ ఇతర ప్రభుత్వ రేటుకు రైతులకు పంపిణీ చేస్తూ బిల్లులు కూడా కంప్యూటరైజ్డ్ చేస్తూ లాభాల్లో నడిపిస్తుండడం అభినందనీయమన్నారు. ఇదే తరహాలో శ్రీసత్యసాయి జిల్లాలో ఐదు ఎరువుల దుకాణాలను వృత్తి సంస్థ ద్వారా ప్రారంభించేందుకు క్షేత్ర స్థాయిలో పరిశీలనకు వచ్చినట్లు తెలిపారు. అనంతరం వృత్తి టీమ్ సభ్యులతో కలిసి దుకాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీపీఎం సత్యనారాయణ, జీవనోపాదుల డీపీఎం రామమోహన్, డీపీఎం ఫైనాన్స్ రామిరెడ్డి, డీపీఎం, సీఆర్‌బీ అరుణ, వృత్తి కోఆర్డినేటర్ గోపినాథ్, ఏపీ మాస్ వాసుదేవరెడ్డి, ఏపీఎంలు సుదర్శన్‌రాజు, మురళి, రమణప్ప, తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే వెంటనే పూర్తి చేయాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను 1వ తేదీలోగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఆయన రాచవేటివారిపల్లి, కొండయ్యగారిపల్లి, ముష్టూరు పంచాయతుల్లో స్వామిత్వ సర్వే తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మెరుగైన సాంకేతికత, మ్యాపింగ్ కోసం ఏర్పాటైన పథకం అన్నారు. 2021 నుంచి 2025వరకు దేశవ్యాప్తంగా 6.62లక్షల గ్రామాల్లో ఈ పథకం సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఆస్తి డేటాను డ్రోన్‌ల సహాయంతో వివిధ సాంకేతికతతో చేపడుతున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఈనెల 10లోగా సర్వే పూర్తి చేసి 15లోపల వెక్టరైజేషన్ చేసి సంబంధిత రెవెన్యూ విలేజ్, గ్రామ కంఠము, ఎక్స్‌టెండెడ్ గ్రామ కంఠము తయారు చేసి నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా వుండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్లకు రూ.2 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అన్నా క్యాంటీన్‌ల నిర్వహణకు మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి రూ.2 లక్షల నగదును విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో రెండు అన్నా క్యాంటీన్‌ల నిర్వహణకు గానూ గురువారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నగదును విరాళంగా అందజేసినట్లు తెలిపారు. పేదలకు రుచికరమైన భోజనం అందించాలని సూచించారు.

బెండ సాగు... ఆదాయం బాగు

ఆశించిన ధర, అధిక దిగుబడులు

ఎకరాకు రూ.1,20,000 ఆదాయం

కడప రూరల్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాకాలం పంట కింద సాగు చేసిన బెండ అన్నదాతలకు సిరులు కురిపిస్తోంది. ఆశించిన దిగుబడులతో పాటు, మార్కెట్‌లో మంచి ధరలు పలుకుతుండడంతో రైతులు ఆనందంలో ఉన్నారు.

సిద్దవటం మండలంలోని ఖాజీపల్లె, టక్కోలి, కాకిపల్లె, డేగలవాండ్లపల్లె, పాత టక్కోలు, మంగళవాండ్లపల్లె, కడపాయపల్లె, లింగంపల్లె, మాచుపల్లె తురకపల్లె, మూలపల్లె తదితర గ్రామాలు కూరగాయల పంటల సాగుకు ప్రసిద్ధి. పలు రకాల కూరగాయలను ఇక్కడి రైతులు పండిస్తుంటారు. ఈ ఏడాది పై గ్రామాల రైతులు దాదాపు 100 ఎకరాల వరకు బెండ పంటను సాగుచేశారు. ఎకరాకు 4 నుంచి 6 కిలోలు వరకు విత్తనం వాడారు. విత్తనశుద్ధితో పాటు, ఎరువులు, పురుగుమందుల వాడకంతో పాటు సకాలంలో సస్యరక్షణ చర్యలను చేపట్టారు. దీంతో ప్రస్తుతం పంట ఆశించిన దిగుబడులను అందిస్తోంది. మార్కెట్‌లో మంచి ధర పలుకడంతో రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు.

రాబడి ఇలా...

బెండ పంట సాగు చేశాక ప్రకృతి అనుకూలించడం, పురుగులు, తెగుళ్లు లేకపోవడంతో అన్నదాతల శ్రమ ఫలించింది. పంట ఆశాజనకంగా ఉంది. ధరలు కూడా బాగున్నాయి. మార్కెట్‌లో కేజీ బెండ ధర రూ.20 నుంచి రూ.40ల వరకు పలుకుతోంది. సరాసరి రూ.20లు చొప్పున ధరలు లభిస్తున్నాయి. ఒక ఎకరాకు 5 నుంచి 6 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ మేరకు ప్రతి రోజు 1500 కేజీల వరకు కాయలను తెంపుతున్నారు. రైతులే నేరుగా సగటున కేజీ రూ.15లు చొప్పున కడప రైతు బజారుతో పాటు, పెద్ద మార్కెట్‌లో హోల్‌సేల్‌గా అమ్ముతున్నారు. ఇలా ప్రతి రోజు 150 కేజీలకు రూ.3000 వరకు రైతుకు వస్తుండగా ఇందులో కోత, రవాణా ఖర్చుల కింద రూ.700 పోను రూ.2300 వరకు రైతుకు దక్కుతోంది. దాదాపు 2 నెలల వరకు పంట కోతలు జరుగుతూనే ఉంటాయి. ఇలా ఎకరాకు రూ.1,80,000లకు పైగా ఆదాయం వస్తోంది. ఎకరాకు సాగు ఖర్చులు రూ.50,000లు పోగా నికరంగా రూ.1,20,000ల వరకు ఆదాయం మిగిలే అవకాశాలు ఉన్నాయి.


సిద్దవటం మండలంలోని కడపాయపల్లెలో సాగు చేసిన బెండపంట

అందుబాటులో మార్కెట్ సౌకర్యం

బెండ పంట సాగు చేసిన గ్రామలు కడపకు సమీపంలో ఉన్నాయి. దీంతో పొలాల్లో బెండకాయలను కోశాక రైతులు బస్తాలకు నింపి ఆటోల ద్వారా నిత్యం కడప మార్కెట్‌యార్డుతో పాటు పెద్దమార్కెట్‌కు తరలిస్తున్నారు. మార్కెట్‌లో ఏ రోజు ధర ఆ రోజే రైతుకు దక్కుతోంది. కొందరు రైతులు నేరుగా వారి ఉత్పత్తులను అమ్ముకుంటూ మరింత లాభాలను గడిస్తున్నారు.

హోంగార్డులసేవ ఆదర్శం

● తోటి హోంగార్డుకు రూ.4,14,640 ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ

కడప క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మానవత్వం, ఐకమత్యం కేవలం మాటల్లోనే కాదని జిల్లాలోని హోంగార్డులు నిరూపించారు. తమతో కలిసి విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఓ హోంగార్డుకు అండగా నిలబడి అభినందనలు అందుకున్నారు. వివరాలిలా.. ప్రొద్దుటూరు పట్టణంలో కమ్యూనికేషన్ విభాగంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల టి.విజయ రాజు (హెచ్‌జీ 85) పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం ఆయన అనారోగ్యంతో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయనకు తోడుగా నిలిచేందుకు జిల్లాలోని హోంగార్డులందరూ ముందుకు వచ్చారు. స్వచ్ఛందంగా ఒకరోజు వేతనాన్ని రూ.4,14,640 వితరణగా ఇచ్చారు. ఈ ఆర్థిక సాయాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ చేతుల మీదుగా చెక్కును జయరాజు కుటుంబానికి అందించారు. ఈసందర్భంగా హోంగార్డుల ఐకమత్యాన్ని ఎస్పీ అభినందిం చారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీశైలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

170 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

చెన్నూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులోని కొత్తరోడ్డు ప్రాంతంలో గల రాజులకాలనీ వద్ద 170 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ క్రిష్టారెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం పోలీసు సిబ్బందితో కలసి దాడి చేసి లారీలో అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన 170 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ బియ్యం చెన్నూరుకు చెందిన బ్రహ్మయ్యకు చెందినవిగా గుర్తించి, అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

చెన్నూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వెంకటసుబ్బయ్య (59) అనే వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు సీఐ క్రిష్టారెడ్డి తెలి పారు. గత నెల 29న వెంకటసుబ్బయ్య రుద్రభారతిపేట నుంచి అలంఖాన్‌పల్లెకు మూడు చక్రాల వాహనంలో వస్తుండగా మదీనా ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం కడపకు తరలించారు. అక్కడ నుంచి తిరుపతి స్విమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గొలుసు చోరీ దొంగ అరెస్టు

కడప క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఉక్కాయపల్లె డంప్ యార్డు వద్ద ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును చోరీ చేసిన కేసులో దొంగను అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కడప నగరం గణేశ్‌నగర్‌కు చెందిన పరచూరి కిశోర్‌కుమార్ గత నెలలో ఉక్కాయపల్లె డంప్‌యార్డు వద్ద నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కుని పారిపోయినట్లు తెలిపారు. అతనిపై నిఘా ఉంచి ఎస్‌ఐలు రవికుమార్, రాజరాజే శ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో గురువారం కిశోర్‌కుమార్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 16.500 గ్రాములు బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

రామాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వలచెరువు తూర్పు భాగంలోని అటవీ ప్రాంతంలో 13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకెళితే.. బుధవారం రాయచోటి ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీట్ ఆఫీసర్ ఎఫ్‌బీవో, ఫారెస్టు సిబ్బంది కొత్తిమడుగు బీట్‌లో కూంబింగ్ నిర్వహిస్తుండగా.. ఎర్రచందనం దుంగలు మోసుకొని వస్తున్న తమిళ కూలీలు, స్మగ్లరు తమ రాకను గమనించి దుంగలను వదిలేసి పారిపోయారని తెలిపారు. దుంగలను లెక్కించగా 13 ఉన్నాయని, వీటి విలువ రూ.1,80,000 ఉంటుందన్నారు. ఈ కూంబింగ్‌లో ఫారెస్టు అధికారి ఆర్.రెడ్డెప్ప, వాచర్స్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల అదృశ్యం



చెన్నూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెన్నూరుకు చెందిన వెంకటసుబ్బయ్య (84), నాంచారమ్మ (80) అనే వృద్ధ దంపతులు అదృశ్యమయ్యారు. ఈ మేరకు వారి కుమారుడు ప్రసాద్ స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం రాత్రి ఫిర్యాదు చేశాడు. రెండురోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళుతున్నామంటూ చెప్పిన ఆ వృద్ధ దంపతులు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వారి ఆచూకీ తెలిస్తే 9440838584 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సోలార్ రూఫ్‌టాప్‌తో గృహాలకు ఉచిత విద్యుత్ : ఎస్ఈ

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోలార్ రూఫ్‌టాప్‌తో గృహాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు విద్యుత్‌శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ పేర్కొన్నారు. గురువారం ఎర్రగుంట్ల, వీరపునాయుని పల్లె, కమలాపురం పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి దిశానిర్దేశం చేశారు. అంతకు ముందు ఆయన చిలమకూరులోని 33/11కేవీ సబ్‌స్టేషన్, పరిసరాలను, ట్రాన్స్‌ఫార్మర్స్‌ని పరిశీలించారు. అక్కడి రికార్డులను తనిఖీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్స్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఈ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం సూర్యఘర్‌తో ఇళ్లకు ఉచిత విద్యుత్ లభించనున్నదని.. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్త వ్యవసాయ కనెక్షన్లు రైతు లు అడిగిన 45 రోజుల్లోనే ఇస్తున్నామని, ప్రస్తుతం ఎక్కడా పెండింగ్ లేవన్నారు. 9గంటలు నిరంతరాయంగా విద్యుత్ రైతులకు ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడా లో ఓల్టేజి సమస్య, లైన్లలో విద్యుత్ లాస్ ఉండకూడదన్నారు. డీసీ లిస్ట్‌ని జీరో తెచ్చినప్పుడే సంస్థకు మంచి మనుగడ ఉంటుంద న్నారు. ఇప్పటికీ కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిసున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాణాలు ఎంతో విలువైనవని సిబ్బంది అన్ని జాగ్రత్తలు పాటించి పనులు చేయాలన్నారు. కమలాపురం, వీఎన్‌పల్లె మండలాల్లో డీసీ లిస్ట్ శాతం ఇప్పటికీ అధికంగా ఉండటంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, డీసీ లిస్టు జీరో చేసిన సిబ్బంది పవన్ తదితరులను శాలువాకప్పి సన్మానించారు. కార్యక్ర మంలో ఈఈ రమణారెడ్డి, డీఈఈ కిరణ్ కుమార్, ఏఈ హరి ప్రసాద్, చాంద్ బాషాలు, ఏఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.


చిలమకూరులో ట్రాన్స్‌ఫార్మర్‌ని పరిశీలిస్తున్న ఎస్ఈ

లక్ష్యం మేరకు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయాలి : కలెక్టర్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో ఎంఐ ట్యాంకులు, గ్రౌండ్ వాటర్ సానుకూల దృక్పథం, సౌర పవన ప్రాజెక్టులు, భూ సమస్యలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీ రావు, సమచార పౌరసంబంధాలశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్ల, నెడ్‌క్యాప్ ఎండీ కమలాకర్‌బాబు తదితర రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్, జాయింట్‌కలెక్టర్ అదితిసింగ్‌లు హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాల న్నారు. అభివృద్ధి పథకాలపై క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందువల్ల జిల్లా అంతటా పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టాలన్నారు. తడి పొడి చెత్తపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానానికి సంబంధించి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జలవనరుల రక్షణ పెంపు. సమ్మర్ స్టోరేజీలు నింపేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎలాంటి ఎరువుల కొరత లేదన్నారు. ఖరీఫ్‌లో అవసరం మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయరంగంలో సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం ప్రారంభించిన పీఎం కుసుమ్ యోజన్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఈ పథకం ద్వారా రైతులకు సోలార్ పంపులు ఏర్పాటు, గ్రిడ్ కనెక్టెడ్ సోలార్ పవర్ ప్లాంట్లను నెలకొల్పడం ద్వారా వ్యవసాయ ఖర్చులు తగ్గించి అదనపు ఆదాయం చేకూర్చేలా సంబంధిత వ్యవసాయ నెడ్‌క్యాప్ అధికా రులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీవో హజరత్తయ్య, కేఎంసీ కమిషనరు మనోజ్‌రెడ్డి, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

శిల్పారామాన్ని సందర్శించిన చైర్‌పర్సన్

కడప కల్చరల్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీపంలో గల శిల్పారామాన్ని గురువారం సంబంధిత శిల్పారామాల చైర్‌పర్సన్ చేరెడ్డి మంజులారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి కళ్యాణ మండపం, డార్మెంటరీ బోటింగ్, టికెట్ల కౌంటర్లు, గేమ్స్‌లను పరిశీలించారు. అనంతరం శిల్పారామంలో జరుగుతున్న పనులు గురించి సంబంధిత పరిపాలనాధికారి కృష్ణప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటసుబ్బయ్యలతో ఆరా తీశారు. ఈ సందర్భంగా మంజులారెడ్డి మాట్లాడుతూ ఇక్కడి కళ్యాణ మండపం నుంచి డార్మెంటరీ వరకు ఫెన్సింగ్ ఏర్పాటుకు నిధులు ఇచ్చామన్నారు. దీంతో పాటు స్క్యాలప్చర్‌లో బొమ్మలకు పెయింటింగ్ కొరకు, మరికొన్ని అభివృద్ధి పనులకు సైతం నిధులు విడుదల చేస్తామన్నారు. ప్రధానంగా వాటర్ గేమ్స్‌లను వైజాగ్, గుంటూరులలో ఏర్పాటు చేశామని.. ఆ కోవలో కడప శిల్పారామంలో కూడా ఏర్పాటు చేసేందుకు వీలుగా ఆసక్తి గల వారికి అనుమతిస్తామన్నారు. దీంతో పాటు చేతివృత్తుల వారికి సైతం స్టాల్స్ ఏర్పాటుకు వీలు గా తక్కువ అమౌంట్‌కే ఇస్తామన్నారు. రాష్ట్రంలోని శిల్పారామాలకన్నా కడప శిల్పారామాన్ని నగర ప్రజలకు మరింత ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా తీర్చిదిద్దుతామని తెలిపారు.


శిల్పారామాన్ని సందర్శిస్తున్న చైర్‌పర్సన్ మంజులారెడ్డి

జాయింట్ ఎల్‌పీ నెంబర్ల సమస్యలను పరిష్కరిస్తాం : ఆర్డీవో

కమలాపురం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రీసర్వే ద్వారా తలెత్తిన జాయింట్ ఎల్‌పీయం నెంబర్ల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపుతామని ఆర్డీవో జాన్ ఎర్విన్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమలాపురం మండలంలో రీసర్వే ద్వారా చాలావరకు భూములు జాయింట్ ఎల్‌పీ నెంబర్లు ద్వారా ఉన్నాయని. వాటితో సమస్యలు తలెత్తుతున్నాయని రైతులు తమ దృష్టికి తెచ్చారన్నారు. వాటిని పరిష్కరించేందుకు చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకంజలో కర్నూలు, అనంతపురం జట్లు

కడప స్పోర్ట్స్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): కడపలో సౌత్ జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే (మూడు రోజల) ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో రెండవ రోజైన గురువారం వివిధ జట్ల మధ్య పోటీలు సాగాయి. ఈమ్యాచ్‌లలో కర్నూలు, అనంతపురం జట్లు ప్రత్యర్థి జట్ల కన్నా వెనుకంజలో ఎదురీదుతున్నాయి. నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు-కడప జట్ల మధ్య సాగుతున్న క్రికెట్‌మ్యాచ్‌లో 304 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు 88.4 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 374 పరుగులు చేసింది. ఇందులో విజయ్‌రామిరెడ్డి 80 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 65 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 261 పరు గులు చేసింది. దీంతో కర్నూలు జట్టు మరో 113 పరుగుల లోటుతో నిలిచింది. అలాగే కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు- అనంత పురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 44.4 ఓవర్లలో 239 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. కాగా 196 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవరోజు గురువారం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 43.3 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో ఎక్కాకర్ 5 వికెట్లు పడగొట్టడం విశేషం. దీంతో నెల్లూరు జట్టుకు 43 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ఇదిలా వుండగా నెల్లూరు జట్టు రెండవ ఇన్నింగ్స్‌కు దిగి 60 ఓవర్లలో 350 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో రోషన్ పవన్‌కుమార్ 83 పరుగులు, సుతేజ్‌రెడ్డి 81 పరుగులు చేశారు. కాగా, రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 3 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 14 పరుగులు చేసింది. ఆటకు శుక్రవారం చివరిరోజు.

వైద్య, 108 సిబ్బంది నిర్లక్ష్యంతోనే యువకుడి మృతి

● జిల్లా అధికారులకు కుటుంబీకుల ఫిర్యాదు

● డీఎంహెచ్‌వో విచారణ ● సిబ్బందిపై చర్యలకు సిఫార్సు

కాశినాయన సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రం నర్సాపురం గ్రామానికి చెందిన బారాగజ్జి మహబూబ్ పీరా(27) అనే యువకుడు గురువారం వైద్య, 108 సిబ్బంది నిర్లక్ష్యంతో మృతి చెందినట్లు మృతుని కుటుంబీకులు ఆరోపించారు. వారి వివరాల మేరకు... ఇటీవల జ్వరంతో బాధపడుతున్న మహబూబ్‌పీరా గురువారం తెల్లవారు జామున శ్వాసపీల్చుకోవడం కష్టంగా ఉండటంతో 108 సిబ్బందికి సమాచారం ఇచ్చామన్నారు. వారు అందుబాటులో ఉన్నప్పటికీ నిర్లక్ష్యపు సమాధానంతో సకాలంలో స్పందించక పోవడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. అక్కడ ఎవరూ విధుల్లో లేకపోవడంతో ఓ ప్రైవేట్ వాహనంలో పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా.. పరిస్థితి విషమించడంతో యువకుడు ఆసుపత్రికి చేరేలోపే చనిపో యాడు. సకాలంలో ఆక్సిజన్ అందించి ఉంటే చనిపోయేవాడు కాదని .. అక్కడి వైద్యులు తెలిపినట్లు మృతుడి కుటుంబీకులు తెలిపారు. దీనికంతటికి వైద్య ఆరోగ్య సిబ్బంది విధుల్లో లేకపోవడం, 108 సిబ్బంది సకాలంలో స్పందించకపోవడమే కారణమమని వాపోయారు. ఈవిష యంపై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేసి బాధితులపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో నాగరాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేష్ నర్సాపురం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని విచారణ చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ పుష్పతో పాటు స్టాఫ్ నర్సులను, ఏఎన్ఎంలను, 108 సిబ్బం దిని, మృతుడి కుటుంబీకులను జరిగిన సంఘటనపై సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించడం లేదని తాము గుర్తించామని.. స్టాఫ్ నర్సు, ఏఎన్ఎంపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే 108 సిబ్బందిపై చర్యలకు సిఫారసు చేస్తామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూస్తామని తెలిపారు.


నర్సాపురంలో వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో నాగరాజు

మహాపూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు


ఆలయ ప్రాంగణంలో హోమం చేస్తున్న అర్చకులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయి. రెండవ రోజు ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరిగాయి. శ్రీదేవి, భూదేవి సమేత నారాపురం వేంకటేశ్వరస్వామికిస్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో ఉత్సవ మూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీరు, పసుపు, చందనములతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ఊరేగింపు వేడుకగా నిర్వహించారు. స్థానిక భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ప్రశాంతి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉల్లిపై జగన్ మొసలి కన్నీళ్లు

● టీడీపీరాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పులివెందులలో పర్యటించి ఉల్లి పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వంపై బురదచల్లాలన్నదే వైఎస్ జగన్ ఏకైక లక్ష్యమన్నారు. గురువారం కడప నగరం ద్వారకానగర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరంతరం రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం, రైతు సంక్షేమానికి పనిచేస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏనాడైన రైతుల గోడు పట్టించుకుందా అని ప్రశ్నించారు. మామిడి కొనుగోలు చేయలేదని ఆయన గుర్తు చేశారు. ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలని, అవసరమైతే స్టోరేజ్ చేసేలా చర్యలు తీసుకోవా లని సీఎం చంద్రబాబు స్పష్టంగా చెప్పారన్నారు. చెప్పిన మూడు రోజులకు జగన్ ఉల్లిపై మాట్లాడడం అవగాహన రాహిత్యమే అన్నారు. హంద్రీనీవా నుంచి పులివెందుల ఎర్రబల్లె చెరువుకు నీరు విడుదల అయిందని, ఒక్కరోజు అయిన నీ నియోజకవర్గానికి నీరు ఇచ్చారా అని జగన్‌ను సూటిగా నిలదీశారు. లోకేష్ హెరిటేజ్ మాది కాదు అని స్పష్టంగా చెప్పారన్నారు, అయితే భారతి సిమెంట్ పరిశ్రమ మాది కాదు అని చెబుతారా, సిమెంటు తక్కువకు ఇవ్వగలరా అని సవాల్ చేశారు. సచివాలయాల్లో, ప్రభుత్వ ఆసుపత్రిలో, వలంటీర్‌లకు పత్రిక పంపి సొమ్ము చేసుకున్నారని విమర్శించారు. వర్షాలు పడుతున్నాయని, రైతులు పంటలు సాగుచేసుకున్నారని, రాష్ట్రంలో ఎక్కడ యూరియా కొరత లేదన్నారు. చెప్పిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు అవుతుంటే ఆ పార్టీ నేతలకు మతిభ్రమించి విమర్శిస్తున్నారని వారి విమర్శలను తిప్పి కొట్టారు.

నేడు బొప్పాయి ధరలు పెంచాలని సమ్మె

● తాడోపేడో తేల్చుకుంటామంటున్న రైతులు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం బొప్పాయి రైతులు ధరలు పెంచాలని సమ్మె నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన రైతులు రైల్వేకోడూరుకు చేరుకుని ఆందోళన కార్యక్రమాలు చేయనున్నట్లు రైతులు నిర్ణయించారు. ఇటీవల టన్ను బొప్పాయి ధర రూ.5 వేలు చేసిన విషయం విదితమే. తోటల్లోకి బొప్పాయి లారీలు రానివ్వకుండా చేయాలని రైతులు నిర్ణయించారు. ధరల విషయంలో తాడోపేడో తేల్చుకోవాలని రైతులు కోరుతున్నారు. గురువారం మార్వాడీలతో రైతులు, దళారులు కలసి చర్చలు నిర్వహించారు. జరిగిన చర్చలు విఫలమయ్యాయని, అందువల్లే సమ్మె నిర్వహించనున్నట్లు బొప్పాయి రైతులు తెలిపారు.

అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న



మంత్రిని కలిసిన పీడీఎస్‌యూ అంకన్న

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలలోని అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న తెలిపారు. కడప జిల్లా పర్యటనలో భాగంగా మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించామన్నారు. ప్రభుత్వ విద్యారంగ బాగుపడాలంటే ముందుగా ఆయా విద్యాలయాల్లో ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని ఆయన మంత్రిని కోరినట్లు తెలిపారు. పదేళ్లుగా ఒక్క కళాశాలలో కూడా అధ్యాపకుల పోస్టు భర్తీకి సంబంధించి ఏ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయలేదని ఆరోపించారు. తక్షణమే మంత్రి చర్యలు తీసుకొని అధ్యాపకుల పోస్టులు భర్తీ చేయాలని కోరారు.

మధ్యతరగతి ప్రజలకు జీఎస్టీ తగ్గింపుతో ఊరట

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్‌కుమార్

రాజంపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతన జీఎస్టీ విధానంతో దేశంలోని 31 శాతం మధ్యతరగతి ప్రజలకు భారీ లాభాలు చేకూరుతున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్‌కుమార్ పేర్కొన్నారు. రాజంపేటలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 1995 నుంచి 2021 వరకు మధ్యతరగతి జనాభా ఏటా 6.3 శాతం పెరుగుతోందన్నారు. ఇప్పుడు జనాభా 31 శాతం పెరిగిందన్నారు. ఈ శాతం 2031కి 38 శాతం, 2027కు 60 శాతం పెరుగుతుందన్నారు. మునపటి 4 జీఎస్టీలు పోలిస్తే 5 శాతం, 18 శాతం మాత్రమే ప్రస్తుతం ఉంటాయన్నారు. ఈ రేట్లు ఈ నెల 22న అమల్లోకి వస్తాయన్నారు. ఇప్పుడున్న 12, 28 స్లాబులను జీఎస్టీ కౌన్సిల్ తొలగించి 5, 18 శాతం స్లాబులు కొనసాగిస్తారన్నారు. ఈ ఏడాది ఆరంభంలో 12 లక్షల వరకు ఆదాయ పన్ను తగ్గించిన తర్వాత గణనీయమైన జీఎస్టీ పన్ను ఉపశమనం మధ్యతరగతి వారు పొందారన్నారు. అనేక ఆహార పదార్థాలపై జీరో జీఎస్టీ ఉంటుందన్నారు. సమావేశంలో బీజేపీ నాయకులు కృష్ణయాదవ్, సునీత నారాయణ రమణయ్య, విఠలాచార్య, తోట రామయ్య పాల్గొన్నారు.

రూ.1.15 లక్షలు పలికిన

గణేశ్ లడ్డూ

నందలూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలిపల్లె గ్రామంలో చవితి ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన లడ్డూ వేలంలో రూ.1.15 లక్షలు పలికింది. అదే గ్రామానికి చెందిన దాసరి గంగులయ్య కుమారుడు ప్రసాద్ వేలంలో లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం ప్రసాద్‌ను మేళతాళాల నడుమ ఊరేగింపుగా లడ్డూను ఇంటికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ఉప్పుశెట్టి సుధీర్, ఉప్పుశెట్టి రెడ్డయ్య, చంద్రమోహన్, పవన్, ప్రసాద్, ఏఎస్‌ఐ సుబ్బయ్య, నిర్వాహకులు పాల్గొన్నారు.

సిద్దవటంలో రూ.70 వేలు

సిద్దవటం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేట ప్రధాన రహదారి వద్ద ఏర్పాటు చేసిన 16వ వార్షికోత్సవాల సందర్భంగా సందర్భంగా 9 రోజులు పూజలు అందుకున్న గణనాథుని 10 కిలోల లడ్డూ వేలంపాటలో దిగువపేట గ్రామానికి చెందిన గిద్దలూరి కుటుంబీకులు రూ.70 వేలకు లడ్డూను దక్కించుకున్నారు. వచ్చిన భక్తులకు అన్నదాన ప్రసాదాలను ఏర్పాటు చేసి లడ్డూ వేలంపాటను దక్కించుకున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సౌజన్యంతో కోనంపేట సర్పంచ్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ లక్ష్మీనారాయణ తెలిపారు. చక్రాయపేట, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు మండలాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. కోనంపేటలో కోదండరామస్వామి దేవస్థానం ఆవరణంలో ఈ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సర్వేపల్లె రాధాకృష్ణన్‌కు

ఘన నివాళి

పెనగలూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పితామహుడు మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినోత్సవం సందర్భంగా చక్రంపేట ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు లేబాకు గోపాలకృష్ణ అధ్యక్షతన ఘనంగా ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి రాధకృష్ణన్ చిత్రపటానికి ఉపాధ్యాయ బృందం ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం అన్వర్‌బాషా, కృష్ణకుమారి, ప్రమీల, పరిమిళ, శ్రీవాణి, పీఎంఎల్‌వీ ప్రసాద్, సతీష్‌బాబు, సుదర్శన్, మహేంద్ర, నరసింహులు, దేవమణి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడూరు విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో కళాశాల సిబ్బంది

రైల్వేకోడూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి 5కే రెడ్ రన్ మారథాన్ కార్యక్రమం జిల్లా కేంద్రమైన రాయచోటిలో మెడికల్, ఆరోగ్య, ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి యం.నాని ప్రథమ బహుమతి (రూ.10 వేల నగదు), పి.జగదీష్ చతుర్థ బహుమతి సాధించారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యం.భాస్కర్‌రెడ్డి తెలిపారు. తమ కళాశాల విద్యార్థులు బహుమతులు సాధించడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.రమేష్, ఆర్ఆర్‌సీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రేమలత, కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ దాసరి మోషే, ఫిజికల్ డైరెక్టర్ కుమారి, ఏ.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా గ్రూప్‌పై విచారణ జరిపించాలి

● హ్యూమన్ రైట్స్ స్టూడెంట్ సెల్ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్

రాయచోటిటౌన్, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సరస్వతినగర్‌లో గల శ్రీచౌడేశ్వరమ్మ డ్వాక్రా గ్రూప్‌లో రూ.3లక్షల 27 వేలు స్వాహాపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టాలని హ్యూమన్ రైట్స్ స్టూడెంట్ సెల్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపల్లి సాయికుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని సరస్వతినగర్‌లో గల శ్రీ చౌడేశ్వరమ్మ డ్వాక్రా గ్రూప్ సభ్యులకు 2024వ సంవత్సరం జనవరి 11న రూ.12 లక్షలు డ్రా రుణం మంజూరైందన్నారు. అయితే ఆ డ్వాక్రాలో నిబంధనల ప్రకారం పది మంది సభ్యులు ఉండాల్సి ఉండగా కేవలం 9 మంది సభ్యులు మాత్రమే ఉన్నారని, రుణం కింద మంజూరైన రూ.12 లక్షల్లో ఒక్కో సభ్యురాలికి రూ.97 వేలు మాత్రమే అకౌంట్‌లో డబ్బులు జమ చేశారని ఆరోపించారు. మిగిలిన డబ్బులు ఏమి చేశారన్న విషయంపై మెప్మా పీడీ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ స్టూడెంట్ సెల్ సభ్యులు భాను, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

● వై హెచ్‌పీఎస్ జాతీయ కమిటీ సభ్యుడు రమణ



బాలుర గురుకుల పాఠశాలలో వసతులపై ఆరాతీస్తున్న సంఘం నాయకులు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించి మెరుగైన విద్యను అందించాలని ఆల్ ఇండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి జాతీయ కమిటీ సభ్యుడు అమావాస్య రమణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఎరుకుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రెడ్డెయ్యతో కలిసి జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను విద్య, ఆరోగ్యం, వసతుల గురించి తెలుసుకున్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా జయమ్మ, శశికళ

రాయచోటి(నేతాజీసర్కిల్), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా సంబేపల్లె ప్రాథమిక పాఠశాలకు చెందిన జయమ్మ, మోడల్ స్కూల్ పీజీటీ కెమిస్ట్రీ శశికళలు రాయచోటి మండలం వైకుంఠరాచపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన అంకం శంకర్‌రెడ్డి, మాధవరం ప్రాథమిక పాఠశాలకు చెందిన వాసుదేవరెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు వెంకటయ్య, ఈ సందర్భంగా పాఠశాలల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు. సెప్టెంబరు 5(శుక్రవారం) ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకోనున్నట్లు తెలిపారు.

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా రమేశ్

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న వర్ల రమేశ్ ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికయ్యారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జన్మదినం పురష్కరించుకుని రాయచోటి అన్నమయ్య జిల్లాలో కలెక్టర్ చామకూరి శ్రీధర్, మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, డీఈవో సుబ్రమణ్యం చేతుల మీదుగా ఉత్తమ ప్రిన్సిపాల్ పురస్కారం అవార్డును అందుకోనున్నారు. చిన్నమండెం ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్‌గా పనిచేసి పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల్లో ఉత్తమ ఫలితాలు, సత్ప్రవర్తన కలిగింపజేసిన ప్రిన్సిపాల్ వర్ల రమేశ్ సేవలు గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ప్రిన్సిపాల్‌గా పురస్కార అవార్డు అందిస్తోంది. అలాగే ఏపీ మోడల్ స్కూల్‌లో జువాలజీ రాజశేఖర్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈయన కూడా మొదటగా లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్ ఏపీ ఎస్సీ ప్రిన్సిపాల్‌గా పనిచేసి ప్రజల నుంచి మంచి మన్ననలు అందుకొని మంచి ప్రవర్తన కలిగిన విద్యార్థులుగా తీర్చిదిద్దారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా నేడు అన్నమయ్య జిల్లాలో పురస్కార అవార్డు అందుకోబోతున్నారు. వీరి ఎంపిక పట్ల అన్నమయ్య జిల్లాలోని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

గురువులు సమాజానికి

వెలుగులు

సిద్దవటం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాకరాపేట వద్ద ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షామీర్‌బాషా గురువారం మాట్లాడుతూ తమ పాఠశాలలో అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేశామని, శుక్రవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదిన వేడుకల సందర్భంగా ముందస్తుగా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దివ్యవాణి, ఉపాధ్యాయులు రామసుబ్బారెడ్డి, రవిశంకర్, రమణయ్య, మాధవిలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేడుకగా వినాయకుని నిమజ్జనం



ఎస్‌ఐని సన్మానిస్తున్న భక్తులు

సుండుపల్లె, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కార్తికేయ నగర్, కృష్ణానగర్‌తో పాటు మండలంలోని పలు ప్రాంతాల్లో గురువారం గణనాథుల నిమజ్జన కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. చవితి సందర్భంగా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథు లను 9 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకొని 9వ రోజు విగ్రహాలను మండల శివాలయం వైశ్యబజారు వినాయకనగర్, పింఛా రోడ్డు వరకు ఊరేగిస్తూ బాణా సంచా కాలుస్తూ కోలాటాల, భజనల మధ్య గణపతి బప్పా మోరియా, జై బోలో గణేశ్ మహరాజ్‌కి జై అంటూ నినాదాలు చేస్తూ డీజే డాన్సులతో ఊరేగింపు నిర్వహిం చారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఎస్‌ఐ ముత్యాల శ్రీనివాసులును ఉత్తమ కమిటీ సభ్యులు, సుండు పల్లె ఏపీయూడబ్ల్యూజే నాయకులు ఘనంగా సన్మానిం చారు.

మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా

సుబ్బనరసయ్యనాయుడు



సుబ్బనరసయ్య నాయుడు

రాజంపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా గన్నే సుబ్బనరసయ్యనాయుడును నియమిస్తూ టీడీపీ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన స్వగ్రామం మేకావారిపల్లె. ఆయన ప్రస్తుతం రాజంపేట రూరల్ మండల పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. పార్టీ వ్యవహారాల్లో చురుగ్గా పాల్గొంటున్న ఈయనను మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట మార్కెట్‌యార్డు అభివృద్ధికి, రైతాంగ సంక్షేమానికి ప్రదానంగా టీడీపీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

యూరియా తగిన మోతాదులోనే ఉపయోగించాలి : ఏవో



రైతులతో పొలంబడిలో పాల్గొన్న ఏవో

పెనగలూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగుచేసే రైతులు యూరియాను పంటకు తగినంత మోతాదులోనే ఉపయోగించాలని పైరు బాగా కనిపించాలని అమితంగా వాడకూడదని పెనగలూరు ఏవో సుబ్రమణ్యం రైతులకు సూచించారు. గురువారం సిరివరంలో రైతులతో కలిసి పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు సాగుచేసే పలు పంటలను పరిశీలించారు. కాగా మండలంలో యూరియా కొరత లేదని, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జిల్లాకు కావాల్సిన యూరియాను అందిస్తున్నారని, కావాల్సిన రైతులు మండలంలోని రైతుసేవా కేంద్ర సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు.

అంతర్జాతీయంగా తీర్చిదిద్దాలి

● సీఎంకు వినతిపత్రం అందజేసిన ఎన్నారై



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న రెడ్డిశేఖర్

సుండుపల్లె, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిని అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబునాయుడుకు మండలానికి చెంది కాంచన రెడ్డిశేఖర్ వినతిపత్రాన్ని అందజేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి ఎయిర్‌పోర్టును అంతర్జాతీయ విమానాశ్రయంగా తీర్చిదిద్దితే కువైట్ సహా గల్ఫ్ దేశాల నుంచి నేరుగా విమానాల రాకపోకలు ప్రారంభించే అవకాశం ఉంటుందన్నారు. అలాగే ఆగిపోయిన రాయచోటి- సుండుపల్లె డబుల్ రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

కార్పొరేషన్ డైరెక్టర్‌గా రమేశ్‌బాబు



రైల్వేకోడూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా రైల్వేకోడూరు టీడీపీ దళిత నాయకుడు పుల్లెల రమేశ్‌బాబు నియమితులయ్యారు. ఈయన మొదట సామాన్య కార్యకర్తగా పనిచేశారు. 2017లో టీడీపీ ఎస్సీ ఎస్టీ ప్రెసిడెంట్‌గా, 2020లో టీడీపీ రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. పార్టీకి చేసిన సేవతో ఆయన్ను అధిష్ఠానం గుర్తించి ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కార్యకర్తలను గుర్తించే పార్టీ ఏదైనా ఉంటే అది టీడీపీయే అని తెలిపారు.

బకాయిలు విడుదల చేయాలి

● ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సతీశ్

రాయచోటిటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6,400 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 6న చేపట్టనున్న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సతీశ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఛలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నేతలు లోకేశ్, సాయివీర్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.20 వేలు విరాళం



గాలివీడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరవీడు కస్పా హరిజనవాడ రామాలయం, యల్లంపల్లి రామాలయం నిర్మాణం కోసం బుక్కపట్నం జానకీదేవి, సుబ్బరాయుడు (ఉపాధ్యాయులు) దంపతులు రూ.20 వేలు నగదును విరాళంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాల నిర్మాణం ద్వారా భక్తిభావాలు పెంపొందించడంతో ప్రజల మధ్య ఐకమత్యం పెరుగుతుందన్నారు. దేవాలయాల నిర్మాణానికి విరాళం అందించిన దాతలను గ్రామస్థులు అభినందించారు.

ఉపాధ్యాయులకు ఘన సత్కారం

నందలూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగనపల్లి వెంకటమరణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు జిల్లా ఉప విద్యాశాఖ అధికారి నాగయ్య, మండల విద్యాశాఖాధికారి-2 అనంతకృష్ణలు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. అనంతరం ఉపాధ్యాయులు గ్లోరి కిరణ్ ఉజాలా, శిల్పి ఆనందాచారి, నాగిశెట్టి లక్ష్మీనారాయణ, బోగా వెంకటసుబ్బయ్య, గొంటుముక్కల వెంకటరమణ, సీవీ ప్రసాద్‌రావు, గౌరి, గీతా, జ్యోతిప్రియ, విజయకుమారి, మస్తాన్, డాక్టర్ శ్రావణి, షాకీర్ హుస్సేన్, పెంచలయ్య, నాగలక్ష్మీలను సత్కరించారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురష్కరించుకొని లక్కిరెడ్డిపల్లె మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన 15 అడుగుల వినాయక విగ్రహాన్ని గురువారం అత్యంత వైభవంగా నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నవరాత్రుల్లో భాగంగా వినాయకుడికి పూజలు నిర్వహించి ప్రతిరోజు రాత్రి వేళల్లో హరికథలు, సాసవల చిన్నమ్మ కథ, బ్రహ్మంగారి జీవిత చరిత్ర డ్రామా, నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిరోజు మధ్యాహ్నం వేళల్లో దాతలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బట్టల షాపు ధనకుమార్ చివరిరోజు వినాయకుని సన్నిధిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కన్నతండ్రే కాలయముడు


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్నబంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థిక మంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతో పాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసు లు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్‌కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పదిమంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జులై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


జి.శంకర (ఫైల్)

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో గాయపడి చికిత్స పొందుతున్న టీడీపీ నాయకుడు జి.శంకర (46) మృతి చెందాడు. బుధవారం రాత్రి మదనపల్లె మండలం బసినికొండ గ్రామం, బైపాస్ నాలుగు రోడ్ల కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు గురువారం మృతి చెందారు. తాలుకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె టమోటా మార్కెట్ మాజీ చైర్మన్ భర్త తట్టి శ్రీనివాసులురెడ్డి కారును డ్రైవర్ షేక్ బావాజాన్ వేగంగా వచ్చి నాలుగు రోడ్ల కూడలిలో నిలిచి ఉన్న ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నిమ్మనపల్లె మండలం ఎగువ మాచిరెడ్డిగారిపల్లెకు చెందిన జి.శంకర మృతి చెందాడు. గాయపడిన మరో వ్యక్తి బొమ్మనచెరువు గోపాల్ చికిత్స పొందుతున్నాడు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె మండలం కొత్తిండ్లులో బుధవారం రాత్రి జరిగింది. తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు కొత్తపల్లె పంచాయతీ రంగారెడ్డి కాలనీ కొత్తిండ్లు చర్చి వీధికి చెందిన షేక్ అర్షద్‌బాషా కుమారుడు షేక్ మహమ్మద్ జైన్ (23) ఇంటిపైన గదిలో ఫ్యాన్‌కు బెల్టుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇతను కామెర్ల వ్యాధితో ఏడాదిగా బాధపడుతూ ఆస్పత్రుల్లో, నాటు వైద్యం చేయించారని, అయినా వ్యాధి నయం కాకపోవడంతో ఇంటివద్దే ఉంటున్నాడు. రాత్రి 9 గంటలైనా భోజనానికి రాకపోవడంతో తండ్రి గదిలోకి వెళ్లి చూడగా అప్పటికే ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే తాలుకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు తండ్రి షేక్ అర్షద్‌బాషా ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని మహిళ దుర్మరణం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో దేవిక (56) దుర్మరణం చెందినట్లు పోలీసులు తెలిపారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు మండలంలోని తట్టివారిపల్లెకు చెందిన దేవిక తట్టివారిపల్లె బైపాస్ సర్కిల్ సమీపంలోని ఓ వైసీపీ నేత ఇంట్లో పనిమనిషిగా పనిచేస్తోంది. అక్కడికి వెళ్లేందుకు నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని గాయపడింది. స్థానికులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించే క్రమంలో ఆస్పత్రిలోనే మృతి చెందింది. తాలుకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యూరియా అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

● డిప్యూటీ విజిలెన్స్ అధికారి గీతావాణి

ఒంటిమిట్ట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యూరియా అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ విజిలెన్స్ అధికారి గీతావాణి పేర్కొన్నారు. గురువారం ఒంటిమిట్టలోని ఎరువుల దుకాణాలను మండల అధికారి మంజులరాణి సీఐ బాబుతో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే యూరియా విక్రయించాలని, మండలంలోని ఎరువు దుకాణాల్లో ఎలాంటి అవకతవకలు జరగలేదన్నారు. ఎక్కడైనా అధిక ధరలకు యూరియా అమ్ముతున్నట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

అన్వేషణాత్మక ఆలోచనలతో పరిశోధనలు

● ఇన్‌స్పైర్ మనాక్‌తో కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం

● దరఖాస్తులకు ఈనెల 15 వరకు గడువు


అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ (ఫైల్)

రాయచోటి (నేతాజీసర్కిల్), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అన్వేషణాత్మక ఆలోచనలను ప్రోత్సహించి పరిశోధనల వైపు ఆసక్తిని పెంపొందింపజేయడానికి కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ మనాక్ నిర్వహిస్తోంది. దేశవ్యాప్తంగా 6 నుంచి 12 తరగతులు చదువుతున్న విద్యార్థుల నుంచి నామినేషన్లను స్వీకరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిని పరిశీలించి ఒక లక్ష అత్యుత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి ఒక్కొక్క విద్యార్థికి రూ.10 వేలు చొప్పున వారి అకౌంట్‌కు నేరుగా నగదును బదిలీ చేస్తున్నట్లు తెలియజేశారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో వీరికి ప్రాజెక్టు పోటీలు నిర్వహిస్తారు. చివరికి 60 మంది విద్యార్థుల ప్రాజెక్టులను ఎంపిక చేసి వాటిని అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుంది. 2025-26 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ మనాక్ అవార్డు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ జూన్ 15 నుంచి ప్రారంభించగా ఇప్పటివరకు 850 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 15వ తేదీతో గడువు ముగుస్తుంది. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలతో పాటు ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఒక్కొక్క పాఠశాల నుంచి ఐదు మంది ఏడు నామినేషన్లు సమర్పించాల్సి ఉందన్నారు.

జిల్లా అగ్రస్థానమే లక్ష్యం

అన్నమయ్య జిల్లాను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యమని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. గత సంవత్సరం అన్నమయ్య జిల్లా రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచిందని, ఈ సంవత్సరం అగ్రస్థానమే లక్ష్యంగా 3 వేల ప్రాజెక్టులు సమర్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. సృజనాత్మకత, ఆవిష్కరణల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించడానికి సరైన నివేదికను అందించినట్లు తెలిపారు.

అన్ని పాఠశాలలు నామినేషన్లు సమర్పించాలి

జిల్లాలో ప్రైవేటు పాఠశాలలతో సహా అన్ని ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల నామినేషన్లు సమర్పించారు. ఈ పథకం యువ విద్యార్థులకు సైన్స్ అధ్యయనం చేయడానికి పరిశోధన, వృత్తి పట్ల ఆసక్తిని పెంచడానికి భారతదేశంలో విస్తృత ఆవిష్కరణ సంస్కృతిని పెంపొందించడానికి ప్రయత్నిస్తుంది. కాబట్టి అన్ని పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించి నామినేషన్లు సమర్పించడానికి ఉపాధ్యాయులు, ఎంఈవోలు బాధ్యత వహించాలి.

- డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, జిల్లా విద్యాశాఖ అధికారి

ఇన్‌స్పైర్ పథకం చక్కగా ఉపయోగించుకోవాలి

చిన్న వయస్సులోనే విద్యార్థులను సైన్స్‌ను అనుకరించడానికి పరిశోధన ఆధారిత కెరీర్ వైపు ప్రేరేపించడానికి ఇన్‌స్పైర్ మనాక్ అవార్డును ప్రతి ఒక్కరూ చక్కగా ఉపయోగించుకోవాలి. ఇందుకోసం గైడ్ టీచర్లకు శిక్షణ ఇచ్చాం. ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేస్తున్నాం. అగ్రస్థానమే లక్ష్యంగా సైన్స్ ఉపాధ్యాయులు అందరూ పనిచేస్తున్నారు. అందరి సహకారంతో లక్ష్యాన్ని సాధిస్తాం.

- మార్ల ఓబుల్‌రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి జిల్లా కోసం పోరాడు...

● రాజంపేట టీడీపీ ఇన్‌చార్జ్ జగన్‌మోహన్‌రాజు


విలేకరులతో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై ఆరోపణలు చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ముందు ఎమ్మెల్యే పదవికి, వైసీపీకి రాజీనామా చేసి రాజంపేట ప్రజలతో కలిసి జిల్లా కేంద్రం కోసం పోరాడాలని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. గురువారం రాజంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీకి వెళ్లని వైసీపీ ఎమ్మెల్యేలకు ప్రజల బాధలు తెలియవన్నారు. వైసీపీ హయాంలో రాజంపేటకు అన్యాయం చేసిన ఆకేపాటి తన ఆస్తులు మాత్రం బాగా పెంచుకున్నారని విమర్శించారు. రాజంపేటను జిల్లా కేంద్రం కాకుండా చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని ఆకేపాడుకు పిలిపించుకుని సంబరాలు చేసుకున్నది ఎవరో అందరికీ తెలిసిందేనన్నారు. చంద్రబాబును ప్రశ్నించే అర్హత ఆకేపాటికి లేదని, దమ్ముంటే అసెంబ్లీ సమావేశాలకు వెళ్లి రాజంపేట జిల్లా కేంద్రం కోసం పోరాడాలన్నారు. రాజంపేటకు అన్యాయం చేసినప్పుడు జగన్‌మోహన్‌రెడ్డిని ఆకేపాటి ఎందుకు ప్రశ్నించలేదన్నారు. రాజంపేట నియోజకవర్గంలోని ప్రాజెక్టులను, ప్రభుత్వ కార్యాలయాలను జిల్లా కేంద్రాలకు, మెడికల్ కళాశాల మదనపల్లెకు తరలించుకుపోతుంటే ఆయన ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. వెంకటేశ్వరస్వామి ఆస్తులను కాజేసేందుకు ఉన్న శ్రద్ధ ప్రజలపై ఉంటే రాజంపేటకు జిల్లా కేంద్రం వచ్చేదని ఆరోపించారు. రాజంపేట అభివృద్ధి, జిల్లా కేంద్రం లక్ష్యంగా టీడీపీ పనిచేస్తుందన్నారు. రాజంపేట అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకువస్తామన్నారు. సమావేశంలో రాజంపేట పార్లమెంట్ లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు, నాగేశ్వర్‌నాయుడు, ఎస్‌కే కరీం, గీతాంజలి రమణ, గంపా శివ, మందా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల దుకాణాల సందర్శన

నిమ్మనపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతు ఉత్పత్తి దారుల సంఘం ద్వారా రైతుల కోసం ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణాలు బాగున్నాయని శ్రీసత్యసాయి జిల్లా డీఆర్‌డీఏ డైరెక్టర్ నరసయ్య తెలిపారు. గురువారం సత్యసాయి జిల్లా నుంచి శాప్ సీఎంఎస్ వృత్తి సంస్థ అధ్వర్యంలో బృందం సభ్యులతో కలిసి రైతు ఉత్పత్తి ఎరువుల దుకాణాలను క్షేత్రస్థాయి సందర్శనకు విచ్చేశారు. అయన రైతుల పంటలకు సంబంధించి ఏ విధంగా ఎరువులు, క్రిమి సంహారక మందులు ఇతర వస్తువులు పంపిణీ చేస్తున్నారని ఆరా తీశారు. రైతుల ఇంటి వద్దకే ఎరువులు క్రిమి సంహారక మందులు పంపిణీ చేయడం హర్షంచదగ్గ విషయమన్నారు. యూరియాతో పాటు మిగిలిన డీఏపీ ఇతర ప్రభుత్వ రేటుకు రైతులకు పంపిణీ చేస్తూ బిల్లులు కూడా కంప్యూటరైజ్డ్ చేస్తూ లాభాల్లో నడిపిస్తుండడం అభినందనీయమన్నారు. ఇదే తరహాలో శ్రీసత్యసాయి జిల్లాలో ఐదు ఎరువుల దుకాణాలను వృత్తి సంస్థ ద్వారా ప్రారంభించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలకు వచ్చినట్లు తెలిపారు. అనంతరం వృత్తి టీమ్ సభ్యులతో కలిసి దుకాణాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీపీఎం సత్యనారాయణ, జీవనోపాదుల డీపీఎం రామమోహన్, డీపీఎం ఫైనాన్స్ రామిరెడ్డి, డీపీఎం, సీఆర్‌టీ అరుణ, వృత్తి కోఆర్డినేటర్ గోపినాథ్, ఏపీ మాస్ వాసుదేవరెడ్డి, ఏపీఎంలు సుదర్శన్‌రాజు, మురళి, రమణప్ప, తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వే వెంటనే పూర్తి చేయాలి

నిమ్మనపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను 1వ తేదీలోగా పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం ఆయన రాచవేటివారిపల్లి, కొండయ్యగారిపల్లి, ముష్టూరు పంచాయతుల్లో స్వామిత్వ సర్వే తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మెరుగైన సాంకేతికత, మ్యాపింగ్ కోసం ఏర్పాటైన పథకం అన్నారు. 2021 నుంచి 2025వరకు దేశవ్యాప్తంగా 6.62లక్షల గ్రామాల్లో ఈ పథకం సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఆస్తి డేటాను డ్రోన్‌ల సహాయంతో వివిధ సాంకేతికతతో చేపడుతున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు ఈనెల 10లోగా సర్వే పూర్తి చేసి 15లోపల వెక్టరైజేషన్ చేసి సంబంధిత రెవెన్యూ విలేజ్, గ్రామ కంఠము, ఎక్స్‌టెండెడ్ గ్రామ కంఠము తయారు చేసి నోటిఫికేషన్ జారీ చేసేందుకు సిద్ధంగా వుండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమేష్, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్లకు రూ.2 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అన్నా క్యాంటీన్‌ల నిర్వహణకు మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి రూ.2 లక్షల నగదును విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలో రెండు అన్నా క్యాంటీన్‌ల నిర్వహణకు గానూ గురువారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నగదును విరాళంగా అందజేసినట్లు తెలిపారు. పేదలకు రుచికరమైన భోజనం అందించాలని సూచించారు.

బెండ సాగు... ఆదాయం బాగు

ఆశించిన ధర, అధిక దిగుబడులు

ఎకరాకు రూ.1,20,000 ఆదాయం

కడప రూరల్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాకాలం పంట కింద సాగు చేసిన బెండ అన్నదాతలకు సిరులు కురిపిస్తోంది. ఆశించిన దిగుబడులతో పాటు, మార్కెట్‌లో మంచి ధరలు పలుకుతుండడంతో రైతులు ఆనందంలో ఉన్నారు.

సిద్దవటం మండలంలోని ఖాజీపల్లె, టక్కోలి, కాకిపల్లె, డేగలవాండ్లపల్లె, పాత టక్కోలు, మంగళవాండ్లపల్లె, కడపాయపల్లె, లింగంపల్లె, మాచుపల్లె తురకపల్లె, మూలపల్లె తదితర గ్రామాలు కూరగాయల పంటల సాగుకు ప్రసిద్ధి. పలు రకాల కూరగాయలను ఇక్కడి రైతులు పండిస్తుంటారు. ఈ ఏడాది పై గ్రామాల రైతులు దాదాపు 100 ఎకరాల వరకు బెండ పంటను సాగుచేశారు. ఎకరాకు 4 నుంచి 6 కిలోలు వరకు విత్తనం వాడారు. విత్తనశుద్ధితో పాటు, ఎరువులు, పురుగుమందుల వాడకంతో పాటు సకాలంలో సస్యరక్షణ చర్యలను చేపట్టారు. దీంతో ప్రస్తుతం పంట ఆశించిన దిగుబడులను అందిస్తోంది. మార్కెట్‌లో మంచి ధర పలుకడంతో రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు.

రాబడి ఇలా...

బెండ పంట సాగు చేశాక ప్రకృతి అనుకూలించడం, పురుగులు, తెగుళ్లు లేకపోవడంతో అన్నదాతల శ్రమ ఫలించింది. పంట ఆశాజనకంగా ఉంది. ధరలు కూడా బాగున్నాయి. మార్కెట్‌లో కేజీ బెండ ధర రూ.20 నుంచి రూ.40ల వరకు పలుకుతోంది. సరాసరి రూ.20లు చొప్పున ధరలు లభిస్తున్నాయి. ఒక ఎకరాకు 5 నుంచి 6 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ మేరకు ప్రతి రోజు 1500 కేజీల వరకు కాయలను తెంపుతున్నారు. రైతులే నేరుగా సగటున కేజీ రూ.15లు చొప్పున కడప రైతు బజారుతో పాటు, పెద్ద మార్కెట్‌లో హోల్‌సేల్‌గా అమ్ముతున్నారు. ఇలా ప్రతి రోజు 150 కేజీలకు రూ.3000 వరకు రైతుకు వస్తుండగా ఇందులో కోత, రవాణా ఖర్చుల కింద రూ.700 పోను రూ.2300 వరకు రైతుకు దక్కుతోంది. దాదాపు 2 నెలల వరకు పంట కోతలు జరుగుతూనే ఉంటాయి. ఇలా ఎకరాకు రూ.1,80,000లకు పైగా ఆదాయం వస్తోంది. ఎకరాకు సాగు ఖర్చులు రూ.50,000లు పోగా నికరంగా రూ.1,20,000ల వరకు ఆదాయం మిగిలే అవకాశాలు ఉన్నాయి.


సిద్దవటం మండలంలోని కడపాయపల్లెలో సాగు చేసిన బెండపంట

అందుబాటులో మార్కెట్ సౌకర్యం

బెండ పంట సాగు చేసిన గ్రామలు కడపకు సమీపంలో ఉన్నాయి. దీంతో పొలాల్లో బెండకాయలను కోశాక రైతులు బస్తాలకు నింపి ఆటోల ద్వారా నిత్యం కడప మార్కెట్‌యార్డుతో పాటు పెద్దమార్కెట్‌కు తరలిస్తున్నారు. మార్కెట్‌లో ఏ రోజు ధర ఆ రోజే రైతుకు దక్కుతోంది. కొందరు రైతులు నేరుగా వారి ఉత్పత్తులను అమ్ముకుంటూ మరింత లాభాలను గడిస్తున్నారు.

హోంగార్డులసేవ ఆదర్శం

● తోటి హోంగార్డుకు రూ.4,14,640 ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ

కడప క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మానవత్వం, ఐకమత్యం కేవలం మాటల్లోనే కాదని జిల్లాలోని హోంగార్డులు నిరూపించారు. తమతో కలిసి విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఓ హోంగార్డుకు అండగా నిలబడి అభినందనలు అందుకున్నారు. వివరాలిలా.. ప్రొద్దుటూరు పట్టణంలో కమ్యూనికేషన్ విభాగంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల టి.విజయ రాజు (హెచ్‌జీ 85) పదవీ విరమణ పొందారు. ప్రస్తుతం ఆయన అనారోగ్యంతో ఉన్నారు. ఈ సందర్భంగా ఆయనకు తోడుగా నిలిచేందుకు జిల్లాలోని హోంగార్డులందరూ ముందుకు వచ్చారు. స్వచ్ఛందంగా ఒకరోజు వేతనాన్ని రూ.4,14,640 వితరణగా ఇచ్చారు. ఈ ఆర్థిక సాయాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ చేతుల మీదుగా చెక్కును జయరాజు కుటుంబానికి అందించారు. ఈసందర్భంగా హోంగార్డుల ఐకమత్యాన్ని ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీశైలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

170 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

చెన్నూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెన్నూరులోని కొత్తరోడ్డు ప్రాంతంలో గల రాజులకాలనీ వద్ద 170 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ క్రిష్టారెడ్డి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం పోలీసు సిబ్బందితో కలసి దాడి చేసి లారీలో అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచిన 170 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ బియ్యం చెన్నూరుకు చెందిన బ్రహ్మ య్యకు చెందినవిగా గుర్తించి, అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

చెన్నూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వెంకటసుబ్బయ్య (59) అనే వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు సీఐ క్రిష్టారెడ్డి తెలి పారు. గత నెల 29న వెంకటసుబ్బయ్య రుద్రభారతిపేట నుంచి అలంఖాన్‌పల్లెకు మూడు చక్రాల వాహనంలో వస్తుండగా మదీనా ఇంజనీరింగ్ కాలేజీ వద్ద ద్విచక్ర వాహనం ఢీకొంది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం కడపకు తరలించారు. అక్కడ నుంచి తిరుపతి స్విమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గొలుసు చోరీ దొంగ అరెస్టు

కడప క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఉక్కాయపల్లె డంప్ యార్డు వద్ద ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును చోరీ చేసిన కేసులో దొంగను అరెస్టు చేసినట్లు చిన్నచౌకు సీఐ ఓబులేసు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. కడప నగరం గణేశ్‌నగర్‌కు చెందిన పరచూరి కిశోర్‌కుమార్ గత నెలలో ఉక్కాయపల్లె డంప్‌యార్డు వద్ద నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కుని పారిపోయినట్లు తెలిపారు. అతనిపై నిఘా ఉంచి ఎస్ఐలు రవికుమార్, రాజరాజే శ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో గురువారం కిశోర్‌కుమార్‌ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 16.500 గ్రాములు బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

రామాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వలచెరువు తూర్పు భాగంలోని అటవీ ప్రాంతంలో 13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకెళితే.. బుధవారం రాయచోటి ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు బీట్ ఆఫీసర్ ఎఫ్‌బీవో, ఫారెస్టు సిబ్బంది కొత్తిమడుగు బీట్‌లో కూంబింగ్ నిర్వహిస్తుండగా.. ఎర్రచందనం దుంగలు మోసుకొని వస్తున్న తమిళ కూలీలు, స్మగ్లరు తమ రాకను గమనించి దుంగలను వదిలేసి పారిపోయారని తెలిపారు. దుంగలను లెక్కించగా 13 ఉన్నాయని, వీటి విలువ రూ.1,80,000 ఉంటుందన్నారు. ఈ కూంబింగ్‌లో ఫారెస్టు అధికారి ఆర్.రెడ్డెప్ప, వాచర్స్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల అదృశ్యం



చెన్నూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరుకు చెందిన వెంకటసుబ్బయ్య (84), నాంచారమ్మ (80) అనే వృద్ధ దంపతులు అదృశ్యమయ్యారు. ఈ మేరకు వారి కుమారుడు ప్రసాద్ స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం రాత్రి ఫిర్యాదు చేశాడు. రెండురోజుల క్రితం ఇంటి నుంచి బయటికి వెళుతున్నామంటూ చెప్పిన ఆ వృద్ధ దంపతులు తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వారి ఆచూకీ తెలిస్తే 9440838584 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సోలార్ రూఫ్‌టాప్‌తో గృహాలకు ఉచిత విద్యుత్ : ఎస్ఈ

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోలార్ రూఫ్‌టాప్‌తో గృహాలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు విద్యుత్‌శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ పేర్కొన్నారు. గురువారం ఎర్రగుంట్ల, వీరపునాయుని పల్లె, కమలాపురం పరిధిలోని విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వారికి దిశానిర్దేశం చేశారు. అంతకు ముందు ఆయన చిలమకూరులోని 33/11కేవీ సబ్‌స్టేషన్, పరిసరాలను, ట్రాన్స్‌ఫార్మర్స్‌ని పరిశీలించారు. అక్కడి రికార్డులను తనిఖీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్స్ వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఈ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పీఎం సూర్యఘర్‌తో ఇళ్లకు ఉచిత విద్యుత్ లభించనున్నదని.. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కొత్త వ్యవసాయ కనెక్షన్లు రైతు లు అడిగిన 45 రోజుల్లోనే ఇస్తున్నామని, ప్రస్తుతం ఎక్కడా పెండింగ్ లేవన్నారు. 9గంటలు నిరంతరాయంగా విద్యుత్ రైతులకు ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎక్కడా లో ఓల్టేజి సమస్య, లైన్లలో విద్యుత్ లాస్ ఉండకూడదన్నారు. డీసీ లిస్ట్‌ని జీరో తెచ్చినప్పుడే సంస్థకు మంచి మనుగడ ఉంటుంద న్నారు. ఇప్పటికీ కొందరు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రాణాలు ఎంతో విలువైనవని సిబ్బంది అన్ని జాగ్రత్తలు పాటించి పనులు చేయాలన్నారు. కమలాపురం, వీఎన్‌పల్లె మండలాల్లో డీసీ లిస్ట్ శాతం ఇప్పటికీ అధికంగా ఉండటంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా, డీసీ లిస్టు జీరో చేసిన సిబ్బంది పవన్ తదితరులను శాలువాకప్పి సన్మానించారు. కార్యక్ర మంలో ఈఈ రమణారెడ్డి, డీఈఈ కిరణ్ కుమార్, ఏఈ హరి ప్రసాద్, చాంద్ బాషాలు, ఏఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.


చిలమకూరులో ట్రాన్స్‌ఫార్మర్‌ని పరిశీలిస్తున్న ఎస్ఈ

లక్ష్యం మేరకు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయాలి : కలెక్టర్

కడప కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో ఎంఐ ట్యాంకులు, గ్రౌండ్ వాటర్ సానుకూల దృక్పథం, సౌర పవన ప్రాజెక్టులు, భూ సమస్యలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీ రావు, సమచార పౌరసంబంధాలశాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్ల, నెడ్ క్యాప్ ఎండీ కమలాకర్‌బాబు తదితర రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు. అలాగే కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్, జాయింట్‌కలెక్టర్ అదితిసింగ్‌లు హాజరయ్యారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాల న్నారు. అభివృద్ధి పథకాలపై క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందువల్ల జిల్లా అంతటా పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టాలన్నారు. తడి పొడి చెత్తపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల ప్రదానానికి సంబంధించి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జలవనరుల రక్షణ పెంపు, సమ్మర్ స్టోరేజీలు నింపేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఎలాంటి ఎరువుల కొరత లేదన్నారు. ఖరీఫ్‌లో అవసరం మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యవసాయరంగంలో సౌరశక్తి వినియోగాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం ప్రారంభించిన పీఎం కుసుమ్ యోజన్ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ఈ పథకం ద్వారా రైతులకు సోలార్ పంపులు ఏర్పాటు, గ్రిడ్ కనెక్టెడ్ సోలార్ పవర్ ప్లాంట్లను నెలకొల్పడం ద్వారా వ్యవసాయ ఖర్చులు తగ్గించి అదనపు ఆదాయం చేకూర్చేలా సంబంధిత వ్యవసాయ నెడ్‌క్యాప్ అధికా రులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీవో హజరత్తయ్య, కేఎంసీ కమిషనరు మనోజ్‌రెడ్డి, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్, జేసీ

మహాపూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు


ఆలయ ప్రాంగణంలో హోమం చేస్తున్న అర్చకులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 4 ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం మహాపూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగిశాయి. రెండవ రోజు ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి సహస్రనామార్చన నిర్వహించారు. యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరిగాయి. శ్రీదేవి, భూదేవి సమేత నారాపురం వేంకటేశ్వరస్వామికిస్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో ఉత్సవ మూర్తులకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీరు, పసుపు, చందనములతో విశేషంగా అభిషేకం చేశారు. సాయంత్రం ఉత్సవ మూర్తులకు ఊరేగింపు వేడుకగా నిర్వహించారు. స్థానిక భక్తులు పూజలు చేసి మొక్కుకున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ప్రశాంతి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఉల్లిపై జగన్ మొసలి కన్నీళ్లు

● టీడీపీరాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పులివెందులలో పర్యటించి ఉల్లి పంటను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, మొసలి కన్నీళ్లు కారుస్తున్నారని టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వంపై బురదచల్లాలన్నదే వైఎస్ జగన్ ఏకైక లక్ష్యమన్నారు. గురువారం కడప నగరం ద్వారకానగర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరంతరం రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం, రైతు సంక్షేమానికి పనిచేస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏనాడైన రైతుల గోడు పట్టించుకుందా అని ప్రశ్నించారు. మామిడి కొనుగోలు చేయలేదని ఆయన గుర్తు చేశారు. ఉల్లికి గిట్టుబాటు ధర కల్పించాలని, అవసరమైతే స్టోరేజ్ చేసేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు స్పష్టంగా చెప్పారన్నారు. చెప్పిన మూడు రోజులకు జగన్ ఉల్లిపై మాట్లాడడం అవగాహన రాహిత్యమే అన్నారు. హంద్రీనీవా నుంచి పులివెందుల ఎర్రబల్లె చెరువుకు నీరు విడుదల అయిందని, ఒక్కరోజు అయిన నీ నియోజకవర్గానికి నీరు ఇచ్చారా అని జగన్‌ను సూటిగా నిలదీశారు. లోకేష్ హెరిటేజ్ మాది కాదు అని స్పష్టంగా చెప్పారన్నారు. అయితే భారతి సిమెంట్ పరిశ్రమ మాది కాదు అని చెబుతారా, సిమెంటు తక్కువకు ఇవ్వగలరా అని సవాల్ చేశారు. సచివాలయాల్లో, ప్రభుత్వ ఆసుపత్రిలో, వలంటీర్‌లకు పత్రిక పంపి సొమ్ము చేసుకున్నారని విమర్శించారు. వర్షాలు పడుతున్నాయని, రైతులు పంటలు సాగుచేసుకున్నారని, రాష్ట్రంలో ఎక్కడ యూరియా కొరత లేదన్నారు. చెప్పిన హామీలన్నీ ఒక్కొక్కటిగా అమలు అవుతుంటే ఆ పార్టీ నేతలకు మతిభ్ర మించి విమర్శిస్తున్నారని వారి విమర్శలను తిప్పి కొట్టారు.

గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యార్థుల సమస్యలను పరిష్కరించి మెరుగైన విద్యను అందించాలని ఆల్ ఇండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి జాతీయ కమిటీ సభ్యుడు అమావాస్య రమణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఎరుకుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రెడ్డెయ్యతో కలిసి జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులను విద్య, ఆరోగ్యం, వసతుల గురించి తెలుసుకున్నారు.

నేడు బొప్పాయి ధరలు పెంచాలని సమ్మె

రైల్వేకోడూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం బొప్పాయి రైతులు ధరలు పెంచాలని సమ్మె నిర్వహించనున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన రైతులు రైల్వేకోడూరుకు చేరుకుని ఆందోళన కార్యక్రమాలు చేయనున్నట్లు రైతులు నిర్ణయించారు. ఇటీవల టన్ను బొప్పాయి ధర రూ.5 వేలు చేసిన విషయం విదితమే. తోటల్లోకి బొప్పాయి లారీలు రానివ్వకుండా చేయాలని రైతులు నిర్ణయించారు. ధరల విషయంలో గురువారం మార్వాడీలతో రైతులు, దళారులు కలసి చర్చలు నిర్వహించినా విఫలమయ్యాయని, అందువల్లే సమ్మె నిర్వహించనున్నట్లు తెలిపారు.

శిల్పారామాన్ని సందర్శించిన చైర్‌పర్సన్


శిల్పారామాన్ని సందర్శిస్తున్న చైర్‌పర్సన్ మంజులారెడ్డి

కడప కల్చరల్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీపంలో గల శిల్పారామాన్ని గురువారం సంబంధిత శిల్పారామాల చైర్‌పర్సన్ చేరెడ్డి మంజులారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. అక్కడి కళ్యాణ మండపం, డార్మెంటరీ బోటింగ్, టికెట్ల కౌంటర్లు, గేమ్స్‌లను పరిశీలించారు. అనంతరం శిల్పారామంలో జరుగుతున్న పనులు గురించి సంబంధిత పరిపాలనాధికారి కృష్ణప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటసుబ్బయ్యలతో ఆరా తీశారు. ఈ సందర్భంగా మంజులారెడ్డి మాట్లాడుతూ ఇక్కడి కళ్యాణ మండపం నుంచి డార్మెంటరీ వరకు ఫెన్సింగ్ ఏర్పాటుకు నిధులు ఇచ్చామన్నారు. దీంతో పాటు స్కల్పచర్‌లో బొమ్మలకు పెయింటింగ్ కొరకు, మరికొన్ని అభివృద్ధి పనులకు సైతం నిధులు విడుదల చేస్తామన్నారు. ప్రధానంగా వాటర్ గేమ్స్‌లను వైజాగ్, గుంటూరులలో ఏర్పాటు చేశామని.. ఆ కోవలో కడప శిల్పారామంలో కూడా ఏర్పాటు చేసేందుకు వీలుగా ఆసక్తి గల వారికి అనుమతిస్తామన్నారు. దీంతో పాటు చేతివృత్తుల వారికి సైతం స్టాల్స్ ఏర్పాటుకు వీలు గా తక్కువ అమౌంట్‌కే ఇస్తామన్నారు. రాష్ట్రంలోని శిల్పారామాలకన్నా కడప శిల్పారామాన్ని నగర ప్రజలకు మరింత ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా తీర్చిదిద్దుతామని తెలిపారు.

జాయింట్ ఎల్‌పీ నెంబర్ల సమస్యలను పరిష్కరిస్తాం : ఆర్డీవో

కమలాపురం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రీసర్వే ద్వారా తలెత్తిన జాయింట్ ఎల్‌పీయం నెంబర్ల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపుతామని ఆర్డీవో జాన్ ఎర్విన్ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమలాపురం మండలంలో రీసర్వే ద్వారా చాలావరకు భూములు జాయింట్ ఎల్‌పీ నెంబర్లు ద్వారా ఉన్నాయని. వాటితో సమస్యలు తెలత్తుతున్నాయని రైతులు తమ దృష్టికి తెచ్చారన్నారు. వాటిని పరిష్కరించేందుకు చొరవ చూపుతామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వెనుకంజలో కర్నూలు, అనంతపురం జట్లు

కడప స్పోర్ట్స్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): కడపలో సౌత్ జోన్ అండర్-23 మెన్స్ మల్టీడే (మూడు రోజల) ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో రెండవ రోజైన గురువారం వివిధ జట్ల మధ్య పోటీలు సాగాయి. ఈమ్యాచ్‌లలో కర్నూలు, అనంతపురం జట్లు ప్రత్యర్థి జట్ల కన్నా వెనుకంజలో ఎదురీదుతున్నాయి. నగర రిమ్స్ సమీప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కర్నూలు-కడప జట్ల మధ్య సాగుతున్న క్రికెట్‌మ్యాచ్‌లో 304 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు 88.4 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 374 పరుగులు చేసింది. ఇందులో విజయ్‌రామిరెడ్డి 80 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు ఆట ముగిసే సమయానికి 65 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 261 పరు గులు చేసింది. దీంతో కర్నూలు జట్టు మరో 113 పరుగుల లోటుతో నిలిచింది. అలాగే కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు- అనంత పురం జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 44.4 ఓవర్లలో 239 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. కాగా 196 పరుగుల ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవరోజు గురువారం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 43.3 ఓవర్లలో 242 పరుగులకు ఆలౌట్ అయింది. బౌలింగ్ విభాగంలో ఎక్బాక్షర్ 5 వికెట్లు పడగొట్టడం విశేషం. దీంతో నెల్లూరు జట్టుకు 43 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. ఇదిలా వుండగా నెల్లూరు జట్టు రెండవ ఇన్నింగ్స్‌కు దిగి 60 ఓవర్లలో 350 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో రోషన్ పవన్‌కుమార్ 83 పరుగులు, సుతేజ్‌రెడ్డి 81 పరుగులు చేశారు. కాగా, రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు ఆట ముగిసే సమయానికి 3 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 14 పరుగులు చేసింది. ఆటకు శుక్రవారం చివరిరోజు.

వైద్య, 108 సిబ్బంది నిర్లక్ష్యంతోనే యువకుడి మృతి

● జిల్లా అధికారులకు కుటుంబీకుల ఫిర్యాదు

● డీఎంహెచ్‌వో విచారణ ● సిబ్బందిపై చర్యలకు సిఫార్సు


నర్సాపురంలో వైద్య సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో నాగరాజు

కాశినాయన సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రం నర్సాపురం గ్రామానికి చెందిన బారాగజ్జి మహబూబ్ పీరా(27) అనే యువకుడు గురువారం వైద్య, 108 సిబ్బంది నిర్లక్ష్యంతో మృతి చెందినట్లు మృతుని కుటుంబీకులు ఆరోపించారు. వారి వివరాల మేరకు... ఇటీవల జ్వరంతో బాధపడుతున్న మహబూబ్‌పీరా గురువారం తెల్లవారు జామున శ్వాసపీల్చుకోవడం కష్టంగా ఉండటంతో 108 సిబ్బందికి సమాచారం ఇచ్చామన్నారు. వారు అందుబాటులో ఉన్నప్పటికీ నిర్లక్ష్యపు సమాధానంతో సకాలంలో స్పందించక పోవడంతో స్థానికంగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. అక్కడ ఎవరూ విధుల్లో లేకపోవడంతో ఓ ప్రైవేట్ వాహనంలో పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా.. పరిస్థితి విషమించడంతో యువకుడు ఆసుపత్రికి చేరేలోపే చనిపో యాడు. సకాలంలో ఆక్సిజన్ అందించి ఉంటే చనిపోయేవాడు కాదని .. అక్కడి వైద్యులు తెలిపినట్లు మృతుడి కుటుంబీకులు తెలిపారు. దీనికంతటికి వైద్య ఆరోగ్య సిబ్బంది విధుల్లో లేకపోవడం, 108 సిబ్బంది సకాలంలో స్పందించకపోవడమే కారణమమని వాపోయారు. ఈవిష యంపై డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేసి బాధితులపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఈ మేరకు డీఎంహె చ్‌వో నాగరాజు, డిప్యూటీ డీఎంహె చ్‌వో మల్లేష్ నర్సాపురం ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని విచారణ చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ పుష్పతో పాటు స్టాఫ్ నర్సులను, ఏఎన్ఎంలను, 108 సిబ్బం దిని, మృతుడి కుటుంబీకులను జరిగిన సంఘటనపై సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించడం లేదని తాము గుర్తించామని.. స్టాఫ్ నర్సు, ఏఎన్ఎంపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే 108 సిబ్బందిపై చర్యలకు సిఫారసు చేస్తామన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చూస్తామని తెలిపారు.

వెంకన్నకు వేడుకగా పవిత్రాల సమర్పణ



పవిత్రాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న టీటీడీ అధికారులు, వేదపండితులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకట రమణ స్వామి ఆలయ వార్షిక పవిత్రోత్సవాల్లో మూడో రోజు టీటీడీ ఆధ్వర్యంలో పవిత్రాల సమర్పణ వేడుకగా నిర్వహించారు. గురువారం తెల్లవారుజామున శ్రీవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేకం, ధూపదీప నైవేద్యాలు పూర్తిచేశారు. అనంతరం వేదపండితులు పట్టు పవిత్రాలను మంగళవాయిద్యాలతో ఆలయంలో ఊరేగింపుగా తీసుకువెళ్లి స్వామి వారి మెడలో, శ్రీదేవి, భూదేవిలకు, ధ్వజస్తంభానికి, ప్రసన్న ఆంజనేయస్వామి వారికి, ఆలయం వెలుపల 12 మంది మూలవర్లకు సమర్పించారు. శుక్రవారం చతుష్టానార్చన, మహాపూర్ణాహుతి, కుంభప్రోక్షణ, పవిత్ర విసర్జన, స్నపనతిరుమంజనం, పవిత్ర వితరణ, చక్రస్నానం సాయంత్రం వీధి ఉత్సవంతో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. డిప్యూటీ ఈఓలు వరలక్ష్మీ, శివప్రసాద్, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, ఉప ప్రధాన అర్చకులు రమేష్ స్వామి, సిబ్బంది నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా వినాయక నిమజ్జనం

గుర్రంకొండ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనాన్ని గురువారం ప్రజలు కోలాహలంగా చేసుకున్నారు. చెర్లోపల్లె, తరిగొండ, టి.రాచపల్లె, నడిమకండ్రిగ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాణసంచా పేల్చుతూ, చెక్కభజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం ప్రతిమలను నిమజ్జనానికి తరలించారు.

వైభవంగా గణేష్ ప్రతిమల నిమజ్జనం





వాల్మీకిపురంలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక ప్రతిమలు

వాల్మీకిపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సాకలవీధి, ఇందిరమ్మ కాలనీ, చింతపర్తి తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమల నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రతిమలకు విశేష అలంకరణలు చేసి పురవీధుల్లో నగరోత్సవం అనంతరం సమీప నీటి కుంటల్లో నిమజ్జనం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ఏఎస్ కాలనీలో వైభవంగా వినాయక నిమజ్జనం



రామసముద్రం వీధుల్లో ఊరేగుతున్న గణనాథుడు

రామసముద్రం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏఎస్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. స్థానిక కాలనీ వాసులు భక్తి శ్రద్ధలతో బొజ్జగణపయ్యకు పూజా కార్యక్రమాలు నిర్వహించి కేరళా సంప్రదాయ నృత్యం, డప్పులు వాయిస్తూ వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎస్ఐ రమేష్‌బాబు సిబ్బందితో పర్యవేక్షణ చేసి శాంతియుత వాతావరణంలో చెరువులో వినాయక నిమజ్జనం జరిగేలా చర్యలు చేపట్టారు.

రైతులకు అందుబాటులో యూరియా



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏఓ స్రవంతి

ములకలచెరువు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులకు అవరమైన యూరియాను అందుబాటులో ఉంచినట్లు ఏఓ స్రవంతి అన్నారు. ములకలచెరువు ఆర్ఎస్‌కేలో రైతులకు పంపిణీకి సిద్ధం చేసిన యూరియాను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మండలంలోని అన్ని ఆర్ఎస్‌కేలలో వారం రోజుల్లో పూర్తి స్థాయిలో యూరియా అందుబాటులో ఉంచుతామన్నారు. యూరియాను ఇతర అవసరాలకు వినియోగించినా, అక్రమంగా నిల్వ ఉంచినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్న చలో విజయవాడను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి నరసింహ పిలుపునిచ్చారు. ఎస్టీ హాస్టల్ విద్యార్థులతో కలసి పోస్టర్లను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు రూ.6,400 కోట్లు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికీ విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పూర్తిగా పరిష్కరించ లేదన్నారు. పలు డిమాండ్ల పరిష్కారం కోసం చలో విజయవాడ నిర్వహిస్తున్నామన్నారు. ఎస్ఎఫ్ఐ నేతలు పాల్గొన్నారు.

వాల్టా ?





రోడ్డు పక్కగా కలప ట్రాక్టర్లు

- అడ్డూ అదుపు లేకుండా కలప రవాణా
- పర్యవేక్షణ కొరవడడమే కారణమా ?
- చోద్యం చూస్తున్న అటవీ అధికారులు

వాల్మీకిపురం, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): మొక్కలను పెంచండి, చెట్లను రక్షించి పర్యావరణాన్ని కాపాడాలని ఓ వైపున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెవిలో జోరీగలా ఊదరగొడుతున్నా, అవగాహన సదస్సులు, ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నా వ్యాపారులు వృక్షాలను ఇష్టానుసారంగా నరికేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అక్రమార్కులు యధేచ్ఛగా చెట్లను తొలగించి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. కేంద్రం వాల్టా చట్టాన్ని తెచ్చి వాటికి కొన్ని నిబంధనలు రూపొందించి ఇందులో మొక్కల సంరక్షణ కూడా చేర్చినా అక్రమార్కులు వాల్టా చట్టాన్ని సైతం చుట్టి చూరులో పెట్టడం సరదాగా ఉంది. వాల్టా చట్టాన్ని సైతం తుంగలో తొక్కుతూ పచ్చదనాన్ని నిలువునా నరికేస్తున్నారు. చెట్టును బట్టి కలపను ఇంటి పనులకు, మరికొన్నింటిని వ్యాపారం నిమిత్తం తరలించేస్తున్నారు. అవకాశం దొరికితే ఎక్కడి కలపనైనా రవాణా చేసేందుకు పథకం రూపొందిస్తుంటారు. ఫలితంగా కలప అక్రమ రవాణాకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. కలప వ్యాపారుల ధాటికి విలువైన వేప, టేకు, మామిడి, చిగురు, మర్రి, చింత, నీలగిరి, ఊడుగ, రోజ్ వుడ్, కానుగ చెట్లు అంతరించిపోతున్నాయి. మండలంలోని పలు ప్రాంతాల నుంచి వృక్షాలను నరికి అప్పనంగా సొమ్ము చేసుకుంటుండం గమనార్హం. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడాలంటుంటే చెట్ల నరికివేత, అక్రమ రవాణాకు అధికారులు కూడా అడ్డు కట్ట వేయలేకపోతున్నారు. వాల్మీకిపురం పట్టణం బైపాస్ రోడ్డులో ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోనే అటవీ అధికారులు కార్యాలయం ఉంది. అయితే ఏమైందిలే అన్న చందంగా అదే కార్యాలయం ముందు నుంచే కలపను అక్రమంగా తరలించుకు పోతుంటారు. వీటిపై అటవీ అధికారులు ఏ మాత్రం నిఘా పెట్టలేదన్న విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో రవాణా సమయంలో అనుమానం వస్తే పట్టణానికి సమీపంలోని గొల్లపల్లె రోడ్డు చాటుగాను, బైపాస్ రోడ్డులో ముళ్ల పొదల చాటున కలప రోడ్లు (ట్రాక్టర్లలో) పెట్టి అటవీ అధికారులు వెళ్లిపోయిన తరువాత బయటి ప్రాంతాలకు తరలిస్తున్నారు. వృక్ష సంపదను ఇష్టారాజ్యంగా కొల్లగొడుతున్న వారిపై తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విషయమై అటవీ అధికారులను వివరణ కోరేందుకు ప్రయత్నిస్తే అందుబాటులో లేకపోవడం గమనార్హం.







వాల్మీకిపురం - గొల్లపల్లె రోడ్డుపై పెట్టిన కలప ట్రాక్టర్లు - బైపాస్ రోడ్డు పక్కగా ఉంచిన లోడు - వాల్మీకిపురం గుండా లారీలో వెళ్తున్న కలప

టీడీపీ నేత శంకర మృతి బాధాకరం

నివాళులర్పించిన నేతలు



శంకర మృత దేహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మదనపల్లి బైపాస్ రోడ్డులో బుధవారం జరిగిన ప్రమాదంలో ఎగువమాచిరెడ్డిగారిపల్లి టీడీపీ నేత శంకర మృతి చెందడం బాధాకరమని రాజంపేట అధికార ప్రతినిధి ఆర్వే వెంకటేష్ పేర్కొన్నారు. శంకర మృతదేహం వద్ద నివాళులర్పించిన ఆయన మాట్లాడుతూ మదనపల్లి బైపాస్ రోడ్డు పక్కన నిలబడి వున్న ఇద్దరిపై వైసీపీ నేత శ్రీనివాసులు రెడ్డి కారు వారిపై దూసువెళ్లినట్లు ఆరోపించారు. అయితే ఈ ప్రమాదంలో టీడీపీ నేత శంకర మృతి చెందడం బాధాకరమన్నారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ ఎల్లవేళలా శంకర కుటుంబీలకు తోడుగావుండి ఆదుకుంటుందని తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



కలిచెర్లలో జరిగిన హెల్పింగ్ మైండ్స్ ఉచిత కంటి వైద్యశిబిరం

పెద్దమండ్యం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కలిచెర్ల తెలుగు హైస్కూల్‌లో గురువారం హెల్పింగ్ మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది సంస్థ వ్యవస్థాపకులు ఆబూబకర్ సిద్ధిక్ కూమార్తె రాబియా అంజూమ్ మొదటి పుట్టిన రోజు పురస్కరించుకుని నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 120 మందికి వైద్య పరీక్షలు చేయగా అందులో 30 మందిని అపరేషన్లకు ఎంపిక చేశారు. మదనపల్లి ఇషి కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో వెంకటేష్, చైతన్య పరీక్షించారు. హెచ్ఎం మీనా నాగలక్ష్మీ, కంటి ఆస్పత్రి డాక్టర్ సునీల్ కుమార్‌ను సంస్థ సభ్యులు సన్మానించారు. హెల్పింగ్ మైండ్స్ సభ్యులు నంద్యాల హరికృష్ణ, ముఖద్దర్, కమ్మల ఆనంద, సమీర్, నవాజ్,నవాజ్, ఉపాధ్యాయులు లక్ష్మీ, రెడ్డిశేఖరరెడ్డి, హేమంత్‌కుమార్, రజనీకాంత్, సుబ్రమణ్యం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ మరణం పార్టీకి తీరని లోటు

- సంతాప సభలో టీడీపీ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ రామకృష్ణ అకాల మరణం టీడీపీకి తీరనిలోటని రాజంపేట అధికార ప్రతినిధి ఆర్వే వెంకటేష్, అధ్యక్షుడు వెంకటరమణ, మండల క్లస్టర్ ఇన్‌చార్జి మునిరత్నం పేర్కొన్నారు. గురువారం బస్టాండు సమీపంలో నిర్వహించిన రామకృష్ణ సంతాప సభలో ఆయన మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచీ రామకృష్ణ పార్టీకి క్రీయాశీలకంగా వ్యవహరిస్తూ పార్టీని ముందుకు తీసుకెళ్లారన్నారు. నేతలు రెడె ప్ప రెడ్డి, విజయ్, హరి, మధుబాబు, సుధాకర్, చంద్ర, రామచంద్ర, శంకర, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజు సదర్భంగా పాఠశాలల్లో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య రక్షణ కోసం పోస్ట్ కార్డ్ ఉద్యమం



రాష్ట్రపతికి కార్డులు పోస్ట్ చేస్తున్న దృశ్యం

పీలేరు రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న 'ఓట్ చోరీ - గద్దె ఛోడ్' ఉద్యమానికి మద్దతుగా పోస్టు కార్డ్ ఉద్యమం చేపట్టినట్లు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృత తేజ తెలిపారు. ప్రధాన తపాలా కార్యాలయం నుంచి ప్రజాస్వామ్యం రక్షించండి అంటూ రాష్ట్రపతికి కార్డులు పోస్ట్ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో జరుగుతున్న ఓటు చోరీని అరికట్టడానికి రాష్ట్రపతి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సాయి సంపత్, నేతలు లోకేష్, యశ్వంత్, మహేంద్ర, సాజిద్ పాల్గొన్నారు.

ఆటోనగర్ భూ సమస్య పరిష్కరిస్తాం

- సర్వే ఏడీతో ఎమ్మెల్యే చర్చలు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సుమారు 30 ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఆటోనగర్ పనులు ప్రారంభించేందుకు భూ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. గురువారం ఆటోనగర్‌ను జిల్లా సర్వే ఏడీ భరత్ కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఆటోనగర్ ప్రదేశంలో ఓ రైతుకు గతంలో ప్రభుత్వం కేటాయించిన భూమిలోనే ఆటోనగర్‌లోకి వెళ్లాల్సిన పరిస్థితి. రైతు హైకోర్టులో కేసు వేయడంతో 10ఏళ్లుగా భూ సమస్య అలాగే సాగుతోంది. కలెక్టర్ ఆదేశాలతో జిల్లా సర్వే ఏడీ ఆటోనగర్‌కు వచ్చి భూ సమస్యను ఎలా పరిష్కరించాలో ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సమస్య తొలగిపోతే ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ఇక్కడ నిర్మాణాలు చేపట్టి ఆటోనగర్ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుబ్రమణ్యం, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో శుభ్రత పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ భానుప్రసాద్

కలకడ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పిల్లలు మంచి వాతావరణంలో చదివేలా అంగన్వాడీ కేంద్రాల్లో శుభ్రతను పాటించాలని ఎంపీడీఓ భానుప్రసాద్ సిబ్బందికి సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భేటీ పడావో- భేటీ బచావో కార్యక్రమంలో భాగంగా గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం సాయాన్ని బాలికలు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలన్నారు. రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ రంగాలు, ప్రభుత్వ పరంగా మహిళలు విశేష కృషి చేస్తున్నారని తెలియజేశారు. హెచ్ఈ రాజమ్మ, ఐసీడీఎస్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'భేటీ పడావో-భేటీ బచావో'పై విస్తృత ప్రచారం



అవగాహన కల్పిస్తున్న సూపర్ వైజర్ స్వరూప

పీలేరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆడపిల్లల సమగ్రాభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న 'భేటీ పడావో-భేటీ బచావో' గురించి విస్తృత ప్రచారం కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప పేర్కొన్నారు. పీలేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పీలేరులో గురువారం నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడుతూ లింగ వివక్ష, విద్యాభ్యాసం, పౌష్టికాహారం, వ్యక్తిగత శుభ్రత, కిశోర దశ వంటి వాటి గురించి బాలికలకు తెలిపి వారిని చైతన్యవంతుల్ని చేయాలన్నారు. తమ కేంద్రాల పరిధి ఆడపిల్లల సంరక్షణ సరిగ్గా జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. అనంతరం ఆ పథకం లక్ష్యాలను వారికి సమగ్రంగా వివరించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు ఉమ, అక్కాయమ్మ, స్వర్ణ, ఆరోగ్య సిబ్బంది సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ శక్తిపై మహిళలకు అవగాహన



మిషన్ శక్తిపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ యస్‌దానీ

పెద్దతిప్పసముద్రం సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిషన్ శక్తి, 'భేటీ బచావో భేటీ పడావో'లో భాగంగా 12వ తేదీ వరకు మహిళలకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు పీటీఎం పీహెచ్‌సీ డాక్టర్ మహ్మద్ యస్‌దానీ తెలిపారు. గురువారం పీటీఎంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్ల శిక్షణలో ఆయన మాట్లాడుతూ మహిళలు బాలిక విద్య, గృహహింస, బాల్యవివాహాల గురించి మహిళలకు అవగాహన కల్పించారు. బాలికల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ నేరమని, అలా చెప్పినా, పరీక్షించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీటీఎం వైద్యాధికారి డాక్టర్ యస్‌దానీ, జిల్లా సైకాలజి సోషియల్ కౌన్సిలర్ హిమాఅల్‌జిమ్, సీడీపీఓ భాగ్యమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు జీఎంఎస్‌కే ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

ప్రజల చేతిలో ప్రభుత్వ సేవలు

ములకలచెరువు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకొచ్చిన వాట్సాప్ గవర్నెన్స్‌తో ప్రజలకు తక్షణం సేవలు అందుతున్నాయని ఎంపీడీఓ హరి నారాయణ అన్నారు. బురకాయలకోటలో వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రదర్శన చేపట్టి అవగాహన కల్పించిన ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలి సారిగా మన రాష్ట్రంలో ప్రభుత్వం వాట్సాప్ గవర్నన్స్‌ను తీసుకొచ్చిందన్నారు. సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆజాద్, టీడీపీ, బీజేపీ నేతలు విజయ్‌కుమార్, బంగారం బాబు, ద్వారకా, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

7న పౌర్ణమి వేడుకలు

వాల్మీకిపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ధర్మపథం సమూహాలయంలో ఆదివారం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకులు శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. 7వ తేదీ ఉదయం 9గంటలకు సత్యనారాయణస్వామి వ్రతం సాయంత్రం 5గంటల నుంచి వల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణోత్సవం, ఆంజనేయస్వామికి ఆకుపూజ, సింధూర పూజ, వడమాల సేవలతో పౌర్ణమి పూజలు జరుగుతాయన్నారు.

7న క్యాంపస్ ఇంటర్వ్యూలు

వాల్మీకిపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 7న ఆదివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రెడ్డెప్పరాజు పేర్కొన్నారు. హొసూరు, శ్రీసిటిలోని ప్రముఖ ఎలెక్ట్రానిక్ కంపెనీలు ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదేని డిగ్రీ కలిగిన 18 నుంచి 30ఏళ్ల వయసు గలవారు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్‌బుక్, మూడు ఫొటోలు తీసుకురావాలన్నారు. దూర ప్రాంత మహిళలకు సురక్షితమైన ఉచిత వసతి కంపెనీలే కల్పిస్తాయని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు నేడు సన్మానం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వంద మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించనున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. గురువారం ఎన్వీఆర్ కళ్యాణ మండపంలో గురుపూజోత్సవం కార్యక్రమం చేస్తున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. గురువులను పూజించుకోవాల్సిన అవసరం అందరికీ వుందన్నారు. శుక్రవారం సర్వేపల్లె జయంతి సందర్భంగా గురుపూజోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. మూడు మండలాల ఎంఈఓలు, ఉపాధ్యాయుల సమన్వయంతో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. టౌన్‌బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్, ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, రూటా మహ్మద్‌ఖాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బార్ అధ్యక్షుడికి సన్మానం

వాల్మీకిపురం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జూనియర్ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవిప్రకాష్‌ను టీడీపీ నేతలు సన్మానించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన రవిప్రకాష్‌ను గురువారం బార్ కార్యాలయం వద్ద కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. బార్ అధ్యక్షుడు మాట్లాడుతూ తనవంతు నిస్వార్థ సేవలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మల్లారపు రవిప్రకాష్, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్, తదితర నేతలు పాల్గొన్నారు.

వీధికుక్కల స్వైర విహారం

బి.కొత్తకోట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం వీధికుక్కలు స్వైరవిహారం చేశాయి. పట్టణంలోని బైపాస్‌రోడ్డు, జయశ్రీకాలనీ, కరెంటుకాలనీ, రంగసముద్రం రోడ్డు తదితర వీధుల్లో పాదచారులపై కుక్కలు దాడి చేశాయి. కాళ్లు, చేతులతో పాటు ఇష్టారాజ్యంగా కరిచి గాయపరిచాయి. దీంతో బాధితులు ప్రభుత్వాస్పత్రికి క్యూ కట్టారు. వీరికి ఆస్పత్రి సిబ్బంది తగిన చికిత్స చేశారు. వీధికుక్కలు పెద్దసంఖ్యలో ఉన్నప్పటికీ ఈ తరహా దాడులు చేసి గాయపరచిన సంఘటనలు సమీపకాలంలో లేవు. కాగా గురువారం ఒకరోజే పదులసంఖ్యలో కుక్కకాటుకు గురవడం ఆందోళన కలిగించింది. అధికారులు కుక్కల సమస్య పరిష్కరించాలని కోరారు.

మహిళల సంక్షేమం కోసమే సంకల్పం

బి.కొత్తకోట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు చేపడుతున్నాయని ప్రాజెక్టు సీడీపీఓ భాగ్యమ్మ పేర్కొన్నారు. గురువారం 7వ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారం, ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంపై ఆమె అవగాహన కల్పించారు.